# వైకుంఠ ఏకాదశికి సౌమ్యనాథ ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

నందలూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి రోజున తెల్లవారు జామున 1.30 గంటల నుంచే స్వామివారి దర్శనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు శ్రీ సౌమ్యనాథ స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం స్వామివారికి లక్ష తులసి అర్చనతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి తెల్లవారు జామున 1.30 గంటల నుంచే దర్శనానికి హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.




# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త



శనివారం 27 డిసెంబర్ 2025


# కలెక్టర్‌ను కలిసిన రాజంపేట ఏజిపి ఛాయాదేవి

రాజంపేట, డిసెంబర్ 26 ప్రభాతవార్త

రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లో ఏజీపీగా నియమితులైన న్యాయవాది ఛాయాదేవి శుక్రవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్కు పుష్పగుచ్చం అందజేశారు. ఏజిపిగా తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా కలెక్టర్కు తెలియజేశారు. ఏజిపిగా ఇచ్చిన అవకాశాన్ని ప్రభుత్వం తరఫున కేసులు బాగా వాదించి మంచి పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు.



# కూటమి చేతిలో రాజంపేట జిల్లా భవితవ్యం

## నాయకులకు అధికార సంకెళ్లు ... సానుకూల సంకేతాలు ఏవీ?

పవర్ కావాలా...?పార్టీ కావాలా...?ప్రజలు కావాలా...? అని నేటి తరం నాయకులను అడిగితే పవర్ (అధికారం) కావాలనే వారే ఎక్కువ అయ్యారు. ఇంకొంచెం తెలివైన నాయకులయితే పవర్ కావాలి ,పార్టీ కావాలి అంటారు. అందుకు కారణం పార్టీలో ఉంటే కదా పవర్ దక్కిందని అనేది వారి మాట. స్వతంత్రంగా ప్రజల మనోభావాలు గెలిచి గెలుస్తామన్న ధీమాలేదు. అందుకే పార్టీ తరపునే కదా మేము గెలిచిందనే వాదన. మరి వారిని గెలిపించిన ప్రజల పరిస్థితి ఏమిటి? ఓటు వేసి గెలిపించిన ప్రజల ఆకాంక్షల వారికి అవసరం లేదు. ప్రజల భవిష్యత్తుతో మాకేం పని అంటున్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తమ పవర్ కోసం, తమ భవిష్యత్ కోసం తాకట్టు పెడుతున్నారు. రాజకీయ పార్టీలు, ఆ పార్టీ నేతలు కూడా అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చాక మరో మాట మాట్లాడుతున్నారు. తమ పార్టీలోని నేతలు గళం విప్పకుండా అధికార సంకెళ్లు వేస్తున్నారు. పార్టీ ఏదైనా, పాలక పక్షం ఎవరైనా ఇదే పద్ధతి అనుసరిస్తున్నారు. ఇందులో తేడా ఏమీ లేదు. అందుకు ఉదాహరణ రాజంపేట జిల్లా కేంద్రం ఇస్తారని మోసపోయిన ప్రజలే. రాజంపేట జిల్లా కేంద్రం సాధన కోసం పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రమైన రాజంపేట, రైల్వే కోడూరులో జరుగుతున్న ఉద్యమం నేపథ్యంలో వార్త అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

రాజంపేట, డిసెంబర్ 26 ప్రభాతవార్త

జగన్ సర్కార్ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన రాష్ట్ర వ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రాన్ని జిల్లా కేంద్రం ప్రాతిపదికగా చేశారు. ఒక రాజంపేట విషయంలో మాత్రం చేయలేదు. అందుకు సాకు వెతికి రాయచోటి సెంటర్ కావడం వల్ల అన్నమయ్య జిల్లా చేశామని చెప్పారు. వైకాపాలో ఎవరిని అడిగినా సెకండ్ పవర్ పాయింట్ పెద్దిరెడ్డి కనుసన్నలలో ఇది జరిగిందని చెబుతారు .ఏమైతేనేం రాజంపేటకు వెన్నుపోటు పొడిచారు. రాజంపేట ప్రజలకు జగన్ సర్కార్ నిర్ణయం షాక్‌గా. రాజంపేటను ఎందుకు జిల్లా కేంద్రం చేయలేదని అడిగే దిక్కులేదు. ఎందుకంటే రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, నాటి ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్, ప్రస్తుత రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డిల గళం జగన్ ముందు మూగబోయింది. ఎన్నుకున్న ప్రజలను నట్టేట ముంచారు. వారి స్వార్థ రాజకీయం కోసం, పవర్‌లో కొనసాగడం కోసం ప్రజలు ఆందోళన చేసినా ,ఉద్యమాన్ని పార్టీ వారే నడిపించినా హై కమాండ్ ఆదేశాలతో జిల్లా సాధన ఉద్యమానికి లాంగ్ బెల్ కొట్టారు. ఫలితంగా రాజంపేట ప్రజల చిరకాల వాంఛ జిల్లా కేంద్రం లేకుండా పోయింది. ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల సభలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమినేతగా అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని, తమ అభ్యర్థులను గెలిపించాలని ప్రధాన ఎన్నికల నినాదంగా హామీ ఇచ్చారు. వైసీపీ జిల్లాల విభజన అస్తవ్యస్తంగా చేశారని, అధికారంలోకి వస్తూనే సరిదిద్దుతామని జిల్లా కేంద్రం విషయంలో అన్యాయం చేసిన వైసీపీని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికలు మూసి ఫలితాలు వచ్చాయి మదనపల్లెలో తెలుగుదేశం విజయదుందుభి మోగించింది రాజంపేటలో సవాలక్ష కారణాలతో టిడిపి అభ్యర్థి పరాజ్యం పాలయ్యారు. పార్లమెంట్ అభ్యర్థిగా బిజెపి తరఫున పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఓడిపోయారు ఎంపీగా వైసీపీ అభ్యర్థి మిథున్ రెడ్డి గెలిచారు. సీన్ కట్ చేస్తే ఈ ఎడాది సెప్టెంబర్ 1న రాజంపేటకు ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చారు. బోయినపల్లిలో జరిగిన ప్రజా వేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతుండగా చివర్లో జిల్లా కేంద్రం ప్రకటించాలని ప్రజలు నినాదాలు చేశారు. స్పందించిన సీఎం ప్రజలపై ఎదురు దాడికి దిగారు. రాష్ట్రమంతా కూటమి అభ్యర్థులు గెలిస్తే రాజంపేటలో ఓడించారు. ఓడించిన వారికి న్యాయం చేయాలా, గెలిపించిన వారికి అన్యాయం చేయాలనా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రం విషయంలో సీఎం తన మనోగతాన్ని అప్పుడే స్పష్టం చేశారు. ఏమైతేనేమి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన ప్రభుత్వం చేపట్టింది. మదనపల్లిలో కొత్త జిల్లాగా ప్రకటించారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తారని వెయ్యి కళ్ళతో ఎదురుచూసిన రాజంపేట ప్రజల ఆశలపై సీఎం నీళ్లు చల్లారు. ఫలితంగా రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గ కేంద్రాలలో రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమం ప్రారంభం అయ్యింది. జేఏసీ ఆధ్వర్యంలో రాజంపేట ఉద్యమం 18 రోజులకు చేరుకుంది. ఇప్పటికే రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిసి రాజంపేట న్యాయం చేయాలని కోరారు. అంతకుముందే రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడప అర్బన్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి చంద్రబాబును కలిసి రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని కోరారు. అలాగే జనసేన ఎమ్మెల్యే అయిన కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను కలిసి రాజంపేట జిల్లా కేంద్రంగా చేయాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి, జనసేన అధినేతలను కలిసిన నేతలకు జిల్లా కేంద్రం చేస్తామనే స్పష్టమైన హామీ ఇప్పటివరకు లభించలేదు. వారిని కలిసిన నేతలు ప్రెస్ మీట్లలో అధినేతలు సానుకూలంగా స్పందించారని మాత్రమే వెల్లడించారు. రాజంపేట, కోడూరు రెండు చోట్ల ఇతర రాజకీయ పక్షాల మద్దతు ఉన్నా ఉద్యమానికి కూటమినేతలే నాయకత్వం వహిస్తున్నారన్నది అక్షర సత్యం. మరోవైపు ప్రజలు టిడిపి,జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దృష్టికి జిల్లా కేంద్రం సమస్యను తీసుకుపోయి అక్కడి నుంచి ఆందోళనకు సంకేతాలు అందిన తర్వాతే ఉద్యమం చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. వైకాపా హాయంలో కూడా ఇదే పంథాలో ఉద్యమం సాగింది. చివరకు అధినాయకత్వం ఆదేశాలతో దీక్షలకు తెరదించారు. ప్రస్తుతం కూడా వైకాపా హయాంలో జరిగిన విధంగానే జరుగుతుందా అన్న అనుమానాలు కూడా ప్రజల్లో లేకపోలేదు. ఎందుకంటే కూటమి నేతలంతా జగన్ సర్కారు చేసిన తప్పిదం వల్లే రాజంపేట జిల్లా కేంద్రం కాకుండా రాయచోటికి పోయిందని విమర్శలు గుప్పిస్తున్నారు .అయితే సామాన్య ప్రజలు మాత్రం జగన్ హయాంలో జరిగిన తప్పును కూటం ప్రభుత్వం సరిదిద్ది రాజంపేటను జిల్లా కేంద్రం ప్రకటించవచ్చు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఉద్యమం ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా



కూటమి ప్రభుత్వం నుంచి జిల్లా కేంద్రం విషయంలో సానుకూల సంకేతాలు లేవనే చెప్పాలి. మరోవైపు రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటి జిల్లా కేంద్రాన్ని మార్చే ప్రసక్తే లేదని మీసం మెలేసి చెప్పారు. వైసిపి నేతలకు తొడ కొట్టి మరీ చెప్పారు. రాయచోటి జిల్లా కేంద్రం మార్చితే రాజీనామా కూడా చేస్తానని ప్రకటించి సంచలనం సృష్టించారు. అంతే కాకుండా అన్నమయ్య జిల్లా ఇన్చార్జి మంత్రిగా బీసీ జనార్దన్ రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిమరీ రాయచోటి జిల్లా కేంద్రం మారదని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రారంభమైన ఉద్యమం కొనసాగుతుంటే కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. సమస్య రోజు రోజు రోజుకు జటిలమవుతోంది. జిల్లా కేంద్రం ఇవ్వలేమని చెప్పలేదు. జిల్లా కేంద్రం విషయంలో రాజంపేట, కోడూరు నియోజక వర్గాలలో ప్రజల భావోద్వేగాలు రోజురోజుకు ఉద్యమాన్ని వేడెక్కిస్తున్నాయి. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉద్యమంలో పోరుబాట సాగిస్తున్నారు. 2024 ఎన్నికల్లో రాజంపేటకు జిల్లా విషయంలోనూ, అభివృద్ధి విషయం లోనూ తీవ్ర అన్యాయం జరిగినా అటు ఎంపీ, ఇటు ఎమ్మెల్యేల అభ్యర్థులను ప్రజలు గెలిపించడం స్వయంకృతాపరాధం అని చెప్పవచ్చు. అందుకు వైసిపి కోట్లు ఖర్చుపెట్టి ఉండవచ్చు. అభ్యర్థుల ఎంపికలో కూటమి రాజంపేట ఎమ్మెల్యే వరకు తప్పు చేసి ఉండవచ్చు. అంతమాత్రాన ప్రజలు జిల్లా విషయంలో జరిగిన అన్యాయాన్ని కాదని ఓటు వేసి కూటమికి ఓటమి ఇవ్వడం ఒక విధంగా శాపం అని చెప్పవచ్చు.రాజంపేట జిల్లా కేంద్రం విషయంలో న్యాయం జరిగితే కూటమి ప్రభుత్వం పునరాలోచించినట్లే. కాదని జిల్లా కేంద్రం చేయకపోతే పాత సామెత యధారాజా,తథా ప్రజా కరెక్ట్ కాదని, యధా ప్రజా... తథా రాజా... అని చెప్పవచ్చు.



రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని ధర్నాలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

# నిద్రమత్తులో రవాణాశాఖాధికారి

: అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లను సీజ్ చేసిన అధికారులు

: నెల మాముళ్లతో అధికారులు తనిఖీలకు దూరం

: అధికలోడుతో వెళ్తున్న టిప్పర్లతో ప్రమాదాలు

బద్వేలు, డిసెంబరు 26 ప్రభాతవార్త :



వాహనాలు తనిఖీలు చేయడంలో అదికారులు నిద్రమత్తుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగిన పుడు మాత్రమే అధికారులు హడావుడి చేస్తుంటారు తప్ప , మిగతా సమయాలలో తమకేమి పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేగాక బద్వేలు అడ్డాగా సిద్దవటం, సోమశిల ప్రాంతాలనుంచి ఇసుక టన్నుల కొద్ది బద్వేలు చుట్టు పక్కల పరిసర ప్రాంతాలకు నిత్యం తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక తరలింపుపై ఆంక్షలు విధించినప్పటికీ, కొంతమంది స్థానికులు ఇష్టానుసారంగా, అడ్డగోలుగా ఇసుకను అధికలతోడుతో తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడతున్నారు. ఇంతజరుగుతున్నా రవాణా శాఖాదికారి నిర్లక్ష్యంగా ఉండడమే కాకుండా చూసి చూడనట్లు వ్యవహరించడంతో అదికలోడుతో వాహనాలు వెళ్లడమే కాకుండా కొన్ని వాహనాలకు సరైన పత్రాలు లేకుండానే రోడ్డుమీదకు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో పొరపాటున జరగరాని సంఘటన చోటు చేసుకుంటే వారి కుటుంబాలు రోడ్డుమీద పడే పరిస్థితి ఏర్పడుతుంది. ఇదంతా వాహనాలు తనిఖీ చేయకపోవడం వల్లే జరుగుతుందని ప్రజలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం విజిలెన్స్ అధికారులు బద్వేలులో తనిఖీలు చేస్తుండగా బైపాస్‌లో అధికలోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లు కనపడ్డాయి. వెంటనే వాటిని తనిఖీలు చేయగా వాహనాలకు పత్రాలు లేకపోవడం , అధికలోడుతో వెళుతున్నా పట్టించుకోకపోవడం వలనే విజిలెన్స్ అధికారులు వాహనాలను సీజ్ చేశారు. నెల మాముళ్లతో స్థానిక అధికారులు, కొంతమంది తనిఖీలకు వచ్చే జిల్లా అధికారులు కూడా నిర్లక్ష్యంగా ఉండడం వల్లే అనేక వాహనాలు బద్వేలు అడ్డాగా ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. స్థానికంగా ఉండే రవాణాశాఖాధికారి ఏ వాహనం కూడా తనిఖీ చేయకపోవడం వల్లే ప్రమాదం జరిగినపుడు ఉలిక్కి పడుతున్నారు. ఇవి అధికలోడుతో భారీ వాహనాలు వెళుతుండడంతో రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి రోడ్లు వేసినపుడు వాహనాలు నిబంధనల మేరకే రోడ్ల మీదకు రావాలనే ఉద్దేశ్యంతో అధికారులు ట్యాక్స్‌లు కట్టించుకుని పంపుతుంటారు. కానీ కొంతమంది వారి స్వార్థ్యం కోసం డబ్బులు ఎక్కువ సంపాదించాలనే ఉద్దేశ్యంతో నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళుతూ ఇటు ప్రజల ప్రాణాలతోను మరియు రోడ్డు భద్రతా నియమాల పట్ల చెలగాటమాడుతున్నారు. ఇలాంటి వాటికి కళ్లెం వేసి తనిఖీల పేరుతో చర్యలు తీసుకోవాల్సిన అధికారులే నిద్రమత్తులో జోగితే ఏమిటని ప్రజలు అంటున్నారు. స్థానికంగా ఉండే అధికారులు తనిఖీ చేయకపోవడం వల్లే ఎక్కడో ఉన్న విజిలెన్స్ అధికారులు టిప్పర్లను సీజ్ చేశారంటే దీనిని బట్టే స్థానిక అధికారుల పరిస్థితి అర్థమవుతుంది.

# ఘోర రోడ్డు ప్రమాదం

## కారును ఢీకొన్న అంబులెన్స్... మహిళ మృతి ఇరువురికి గాయాలు

చిన్నమండెం డిసెంబర్ 26 ప్రబాత వార్త:



మండలంలోని కేశాపురం గ్రామం దేవళంపేట చెక్ పోస్ట్ వద్ద రాయచోటి బెంగళూరు ప్రధాన రహదారిలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది.వివరాల లోకి వెళితే కడప పట్టణం దేవునికడపకు చెందిన ఓగురు ప్రవీణ బెంగళూరు లో సాఫ్ట్ వేర్ ఇంజనీరుగా పని చేస్తూ భర్త గణేష్ తో కలిసి వుంది.వీరికి చక్రధర్,ధన్విత్ అనే ఇద్దరు కుమారులు. శుక్రవారం ప్రవీణ ఆమె తల్లి మాధవి ఇద్దరు పిల్లలు కడపకు కారులో బయలుదేరారు,వారికి గణేశ్ కారు ఏర్పాటు చేశారు.వారు కారులో కేశాపురం చెక్ పోస్ట్ వద్దకు రాగానే కడప వైపు నుండి వస్తున్న అంబులెన్స్ వ్యాను అతివేగంగా వచ్చి కారు ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ అక్కడికక్కడే మృతి చెందగా ఆమె కుమారులు,తల్లి కి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే వారిని రాయచోటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కారు డ్రైవర్ మల్లారెడ్డి కి స్వల్ప గాయాలు అయ్యాయి. అతివేగంగా వచ్చే అంబులెన్స్ ను చూసి కారు ను రోడ్డు ప్రక్కన ఆపినా అంబులెన్స్ డ్రైవర్ నిరక్ష్యం వల్ల ఈ ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.సంఘటనా స్థలంలో బారికేట్లు కూడా ఏర్పాటు చేసి ఉన్నారు.ప్రకాశం జిల్లా కు చెందిన అంబులెన్స్ ను బెంగళూరు వాళ్లకు విక్రయించడంతో దానిని డెలివరీకి తీసుకెళుతూ డ్రైవర్ రవీంద్రబాబు ఈ ప్రమాదానికి కారణం అయ్యాడు. అంబులెన్స్ డ్రైవర్ మద్యపానం చేసి వాహనం నడిపినట్లు సమాచారం .పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇద్దరు కుమారులతో అమ్మగారి ఇంటికి వెళుతున్న మహిళ మృతి చెందడం పిల్లలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడ ఉన్న ప్రతిఒక్కరిని ఈ సంఘటన కంట తడి పెట్టించింది.

# 22ఏ భూముల సమస్యలపై జిల్లా కలెక్టర్ స్పెషల్ డ్రైవ్

రాయచోటి, టౌన్ డిసెంబర్ 26:ప్రభాత వార్త



ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని 22ఏ, చుక్కల భూముల సమస్యలపై జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్రవారం స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. పలు కారణాలవల్ల 22ఏ, చుక్కల భూములకు సంబంధించిన ఎన్వోసీలు ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్నాయన్న విషయం తెలిసిందే. ఈ భూముల పరిష్కారానికి శుక్రవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభించి జిల్లా యంత్రాంగానికి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా నేడు 22 ఎకరాల 62 సెంట్ల భూములకు సంబంధించిన ఎన్వోసీలను జారీ చేశామన్నారు. మదనపల్లి మండలానికి చెందిన శ్రీలత, భాస్కర్, కానాల చెంగమ్మ, హేమలత, నందకిషోర్, కురబలకోట మండలానికి చెందిన మస్తాన్ రెడ్డి లకు ఈ సందర్భంగా ఎన్ఓసీ లను జారీ చేశామని పేర్కొన్నారు. మరో 15 ఎకరాల 28 సెంట్ల 22 ఏ భూములకు సంబంధించిన 10 కేసులను విచారణ చేపట్టామని వీటికి సంబంధించిన ఎన్వోసీ లను సోమవారం నాడు జారీ చేస్తామన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న 22 ఏ,చుక్కల భూముల సమస్యలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని త్వరలో ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రికార్డుల ఫోర్జరీ కేసులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్ఓసీలను పొందిన లబ్ధిదారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న తమ 22 ఏ భూముల సమస్యలు పరిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, జిల్లా పాలన యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నీటి తొట్టిలో పడి

# నాలుగేళ్ల బాలుడు మృతి

మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 26 ప్రభాతవార్త.



ఆడుకుంటూ వెళ్లిన ఓ నాలుగేళ్ల చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా సోమల మండలానికి చెందిన జ్యోతిప్రకాష్ గత రెండేళ్లుగా మదనపల్లి మండలం, వలసపల్లి గ్రామ సమీపంలోని ఒక మామిడి తోటకు కాపలాగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం జ్యోతిప్రకాష్ కుమారుడు విక్రాంత్ (4) ఇంటి ముందు ఆడుకుంటూ, సమీపంలో ఉన్న నీటి సంపు వద్దకు వెళ్లిన బాలుడు, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. కొంతసేపటికి బాలుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల వెతికారు. చివరకు నీటి తొట్టిలో విగతజీవిగా పడి ఉన్న విక్రాంత్‌ను చూసి వారు తల్లడిల్లిపోయారు. అల్లారుముద్దుగా పెరుగుతున్న కొడుకు కళ్ల ముందే విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నకిలీ మద్యం కేసులో పోలీస్ కస్టడీకి 5మంది నిందితులు

మదనపల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త



నకిలీ మద్యం తయారు కేసులో ఐదు మంది నిందితులను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసులో నిందితులు జనార్దన్ రావు, శ్రీనివాస రావు, జగన్మోహన్, రమేష్, అష్రఫ్ అలీలను పోలీస్ కస్టడీ తీసుకొని విచారణ చేపడుతున్నారు. వీరిని 3 రోజుల పాటు కస్టడీకి ఇస్తే కోర్టు ఆదేశాలు జారీ చేసింది. తొలిత నిందితులను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు అనంతరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. మలకలచెరువు ఎక్సైజ్ పోలీసులు, సిట్ అధికారులు ఆధ్వర్యంలో నిందితులను విచారిస్తున్నారు. ములకలచెరువు నకిలీ మద్యం తయారు కేసు రాష్ట్రంలో సంచలనం లేపిన విషయం తెలిసిందే. పోలీసుల విచారణలో మద్యం తయారీ కేంద్రంలో పోలీసులు కు లభించిన డైరీ, సెల్ఫోన్ కాల్ డేటా, నకిలీ మద్యం క్రయవిక్రయదారుల సంబంధించి వివరాల మేరకు 36 మంది నిందితులు ఉన్నట్టు గుర్తించి వారిపై కేసు నమోదు చేశారు. వారిలో ఇప్పటికే 30 మందిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు, మిగిలిన వారి కోసం గాలింపులు చేస్తున్నారు. ఈ కేసును సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. బెల్టు షాప్ ల కు సరఫరా చేసిన వివరాలు, ప్రధాన నిందితుడు జనార్దన్ రావు, తంబళ్లపల్లి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ దాసరపల్లి జయచంద్రారెడ్డితో ఉన్న ఆర్థిక లావాదేవీలు పలు కీలక విషయాలపై విచారించినున్నట్లు తెలిసింది.

# రుణాలు ఇప్పిస్తామని ఘరానా మోసం

మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 26 ప్రభాతవార్త.



రూ.3వేలు కడితే 5లక్షల సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని రాయచోటికి చెందిన ఫరీదా మోసం చేసిందని, పూచి పడి మహిళల దగ్గర రూ. 3,000 కట్టించిన మదనపల్లెకు చెందిన ఓ బాధితురాలు శుక్రవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటన పై బాధితురాలు తెలిపిన వివరాలు.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఫరీదా సెంట్రల్ గవర్నమెంట్ ప్రోగ్రాం ఇన్చార్జినని స్థానిక రామారావు కాలనీకి చెందిన రూప (27) తో రెండేళ్ల క్రితం పరిచయం చేసుకుంది. స్థానికంగా ఉన్న 207 మంది మహిళలకు ఐదు లక్షల సబ్సిడీ లోన్లు ఇప్పిస్తానని వారి దగ్గర రూ.3వేలు కట్టించుకుని ముఖం చాటేసింది. 3000 కట్టిన మహిళలు రెండేళ్లయిన లోన్లు ఇవ్వకపోవడంతో రూపాన్ని ఇంటి వద్దకు వచ్చి నిలదీసి వేధించారు. మోసం చేసిన మహిళపై రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన న్యాయం జరగక పోవడంతో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు చికిత్స లు అందించారు.

# కొనసాగుతున్న పోలీసు శాఖ స్పెషల్ డ్రైవ్

కడప క్రైం, డిసెంబరు 26, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు మహిళా భద్రత స్పెషల్ డ్రైవ్ మాసంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, కాలనీలు, పట్టణ ప్రాంతాల్లో పోలీసు అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం పోలీసు అధికారులు ప్రత్యక్షంగా గ్రామాలు, కాలనీలను సందర్శించి మహిళలు, యువతులు, బాలికలతో ముఖాముఖి మాట్లాడి వారి భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ, గౌరవం, హక్కుల పరిరక్షణకు సంబంధించిన భారత న్యాయ సంహితలోని ముఖ్యమైన చట్టాలు, శిక్షల వివరాలు, వాటి ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. సిబ్బంది మహిళల రక్షణ మన బాధ్యత, రక్షణ పొందడం వారి హక్కు నినాదంతో ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను పోస్టర్లు, ఫ్లెక్సీలపై ముద్రించారు. డయల్ 112 (అత్యవసర సహాయం), చైల్డ్ లైన్ 109(పిల్లల రక్షణ), గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర నంబర్లను సంప్రదించాలన్నారు.

# రాజంపేట మున్సిపల్ కమిషనర్ గా లక్ష్మీనారాయణ

రాజంపేట, డిసెంబర్26 ప్రభాతవార్త

రాజంపేట మున్సిపల్ కమిషనర్ గా కడప కార్పొరేషన్ లో శానిటరీ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న లక్ష్మీ నా రాయణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న జీ.శ్రీనివాసులును తిరిగి కర్నూల్ కార్పొరేషన్ లో శానిటరీ ఇన్స్పెక్టర్గా పంపింది. ఈ మేరకు రాష్ట్ర పట్టణ అభివృద్ధి శాఖ కార్యదర్శి సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా పోస్టింగ్ వచ్చిన కమిషనర్ లక్ష్మి నారాయణ త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం.

# హోంగార్డు వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 26, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు త్రీటౌన్ పీఎస్ పరిధిలో ఈనెల 22న రాత్రి బ్లూకోట్ విధుల్లో ఉన్న హోంగార్డును ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయపడ్డ హోంగార్డు వెంకటరమణకు జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. మానవతా దృక్పథంతో జిల్లా ఎస్పీ చేసిన సాయానికి హోంగార్డు వెంకటరమణ ధన్యవాదాలు తెలిపారు. 22న రాత్రి బీసీ 5 విధుల్లో ఉన్న వెంకటరమణ మరో కానిస్టేబుల్ పహారా విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఆది నరసింహులు అనే సస్పెక్ట్ షీట్ కలిగిన వ్యక్తి ఉద్దేశపూర్వకంగా హోంగార్డును మోటారు సైకిల్‌తో ఢీకొట్టడంతో తతీవ్ర గాయాలయ్యాయి. తక్షణమే నైట్‌బీట్ చెకింగ్ అధికారులైన ప్రొద్దుటూరు టూటౌన్ సీఐ, ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ హోంగార్డును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సాయం అందించారు.

## ఐక్యమత్యాన్ని చాటుకుందాం

**పీలేరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



హాజరైన కురబ నాయకులు

కురబలు తమ ఐక్యమత్యాన్ని చాటుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని అవుతుందని సంఘ నాయకులు తెలిపారు. శుక్రవారం పీలేరులో కురబల కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు మాట్లాడుతూ కురబ కులస్తులు అందరూ కలిసికట్టుగా సంఘంగా ఏర్పడి మన మధ్య ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా అందరు కలిసి పరిష్కరించుకునే దిశగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. త్వరలో కురబలు అందరూ సమావేశమై సంఘ నాయకులను ఎన్నుకుని, సమస్యల పరిష్కారం వైపుకు కలిసినడుద్దామని అన్నారు. మదనపల్లిలో ప్రత్యేకంగా కళ్యాణ మండపం నిర్మాణం జరుగుతోందని, ఈ విధంగా ప్రతి మండల స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు, కుల సంఘాల తోడ్పాటుకు అందరూ కలిసి రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కురబ సంఘ నాయకులు డి. రామాంజులు, జీవి శివకుమార్, వై. శ్రీరాములు, బి. ప్రభు, జనార్దన్ గౌడ్, కృష్ణమూర్తి, ఏఎంసీ డైరెక్టర్ ఆవుల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేపు తలుపులలో ఉచిత వైద్య శిబిరం

**పీలేరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



ఈనెల 28న పీలేరు మండలం, తలుపులలో మహిళల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ఏ. మాధవి తెలిపారు. శుక్రవారం పీలేరులో డాక్టర్ మాట్లాడుతూ మండలంలోని తలుపుల పంచాయితీ కార్యాలయం ఆవరణంలో 28న ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. వైద్య శిబిరంలో సంతానం లేని దంపతులకు, గర్భాశయ సమస్యల్లో ప్రధానంగా రక్తస్రావం, తెల్లబట్ట, క్రమం తప్పి బహిష్టులవడం, అండాశయంలో గడ్డలు ఏర్పడడం, ట్యూబ్స్ లో సమస్యలతో బాధపడే మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ మాధవి తెలియజేశారు. ఈ అవకాశాన్ని పిల్లలు లేని దంపతులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మాధవి హాస్పిటల్ యాజమాన్యం కోరుతోంది. పీలేరులోని తమ మాధవి హాస్పిటల్ లో పిల్లలు లేని దంపతులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి, తగిన వైద్యం అందిస్తున్నామన్నారు. తమ దగ్గర అత్యాధునిక ఐయుఐ ల్యాబ్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.

## ఘనంగా బాల వీర్ దివాస్ వేడుకలు

**నందలూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త :**



స్థానిక అన్నమాచార్య అకాడమీ స్కూల్ నందు బాల వీర్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ సమ్మెటశివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన బాల వీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు వారి జీవితాలు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని యువతలో దేశభక్తి భావాలను పెంపొందించడంలో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ అరిగే రాంబాబు, చుక్క శ్రీనివాసులు, స్వామి విఠలాచార్య, వీరబల్లి జై కుమార్ రెడ్డి, మన్నెం నాగేంద్ర, రాచూరి మురళి, ప్రధానోపాధ్యాయులు ఏనుగుల బాలాంజనేయులు డైరెక్టర్ మాద పూరి హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అప్పలరాజుపైపెట్టిన పిడి చట్టం ఎత్తివేయాలి

**బద్వేల్ అర్బన్ డిసెంబర్ 26 ప్రభాత వార్త:**



సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం. అప్పలరాజుపై అక్రమంగా బనాయించిన ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం కేసును ఎత్తివేసి అతనిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను మాట్లాడుతూ ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న అప్పలరా జుపై చట్టవిరుద్ధంగా బనాయించిన అక్రమ పిడి చట్టం కేసును ఉపసంహరించి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.చాంద్ భాష, పట్టణ కమిటీ సభ్యులు ఎస్. రాయప్ప,పార్టీ నాయకులు జి. సుబ్బరాయుడు,జి. వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు రమణ, ఓబులేసు, నారాయణ, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## దూలవారిపల్లెను పంచాయతీగా ఏర్పాటు చేయాలని వినతి

**కలసపాడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



కలసపాడు మండలంలోని తెల్లవాడు పంచాయతీలో దూరం వారి పల్లి ఎస్సీ కాలనీ కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయ చేయాలని స్థానికులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. అలా కాకపోతే మా ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ దూలం వారి పల్లెను కలవాడు పంచాయతీలోని కొనసాగించాలని ఆమెకు తెలియజేశారు.

## కుక్కలు పట్టివేత

**కలసపాడు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో శుక్రవారం సర్పంచ్ చొరవతో కుక్కలను పట్టారు. సుమారుగా 30 కుక్కలను డాక్టర్లు బోన్లు ఎక్కించారు. ఇంకా ఉన్నాయని కలసపాడు సర్పంచ్ తెలిపారు.

## ట్రాఫిక్ సమస్య తీర్చి పుణ్యం కట్టు కోండి..

**సుండుపల్లె ,డిసెంబర్ 26,ప్రభాతవార్త :**



మండల కేంద్రంలోని రోడ్లపై ఆక్రమణలతో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు మితిమీరిపోతున్నాయి. జనసందడిగా ఉన్న సుండుపల్లి నడిబొడ్డులో ప్రజలు నడవాలంటే భయమేస్తుందని ఈ ట్రాఫిక్ సమస్యతీర్చి పుణ్యం కట్టుకొండని ప్రజలు వేడుకొంటున్నారు. కేంద్రం నుండి రాయచోటి, పీలేరు, పించా, కమ్మ గుట్ట పల్లెలకు వెళ్లే రహదారులలో కూరగాయల అంగళ్లు, పూల అంగళ్ళు, ఫాస్ట్ ఫుడ్ బండ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు రోడ్లపైనే పెట్టడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు అక్కడ ట్రాఫిక్ ఎక్కువగా నిలిచిపోతున్నది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాలలో పాఠశాలలకు వెళ్లేప్పుడు, పాఠశాలల నుండి తిరిగి ఇళ్లకు వెళ్ళేటప్పుడు స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు, కార్లు, లారీలు వంటి వాహనాలు వస్తే ఆ వాహనాలను దాటలేని పరిస్థితి మండల కేంద్రంలో నెలకొని ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలను తీర్చాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## సకాలంలో రుణాలు చెల్లించాలి

**దువ్వూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**



దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రుణాలు తీసుకున్నా రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే సంఘం అభివృద్ధి చెందుతుందని బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసుల రెడ్డి, ప్రెసిడెంట్ పోలు రామ్మోహన్ రెడ్డిలు అన్నారు. శుక్రవారం దువ్వూరు సహకార సంఘం పాలక మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రుణాలు చెల్లించి తిరిగి తీసుకోవాలన్నారు. అలాగే సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో, వాయిదా మీరిన వాటినే చెల్లించకపోతే సహకార చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ఆదేశించిందని వాటిపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దువ్వూరు సహకార సంఘం ద్వారా కొద్ది రోజుల్లోనే రైతులకు రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సీఈఓ రామ్మోహన్, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి నడిపేవారిపై స్పెషల్ డ్రైవ్

**కడప క్రైం, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కడప ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ తెలిపారు. మైనర్లు, లైసెన్స్ లేని వారు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రంక్ డ్రైవింగ్ కింద పట్టుబడితే మోటారు వాహనాల చట్టం 1998 సెక్షన్ 185 కింద కేసులు బుక్ చేయడం జరుగుతుందన్నారు. నేరస్థులకు జరిమానాలు మొదటి నేరానికి రూ.10వేలు, లేదా 6 నెలలు వరకు జైలు శిక్ష తదుపరి నేరాలకు రూ.15వేలు లేదా 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, నేరస్థుడి డ్రైవింగ్ లైసెన్స సస్పెండ్ చేయడమే లేదా రద్దు చేయబడుతుందని సూచించారు. తద్వారా వారు దేశంలో డ్రైవింగ్ చేయడానికి అనర్హులవుతారన్నారు. మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రాణాపాయకరమైన ప్రమాదం జరిగితే భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 105 కింద క్రిమినల్ కేసు నమోదు చేయబడుతుందని 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జరిమానా విధించబడుతుందని ట్రాఫిక్ సీఐ వెల్లడించారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ధకాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు.

## వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలి.

**బద్వేలు అర్బన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించినట్లయితే అక్కడ సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని, మలేరియా సబ్ యూనిట్ అధికారి టి నరసింహ రెడ్డి అన్నారు. బద్వేల్ మండలంలో తిప్పనపల్లిలో, శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ప్రతి వీధిలో డ్రైనేజీ, నీటి నిల్వ గుంతలు, తడి ప్రదేశాలు గుర్తించడం జరిగింది. ప్రతి ఇంటిలో లార్వా, ఫీవర్ సర్వే నిర్వహించడం జరిగింది. వారికి శుభ్రత పై అవగాహన కల్పించడం జరిగింది. కాలువలలో అబేట్, నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉత్పత్తి కాకుండా ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ, గత 20 రోజులుగా తిప్పనపల్లి, దళితవాడలో సమావేశాలు ఏర్పాటు చేసి శుభ్రత పై అవగాహన కల్పించడం జరిగింది. సుదూర ప్రాంతాలకు పోకుండా అవసరమైన మెడికల్ క్యాంపులను నిర్వహించి, వారికి మెరుగైన వైద్యం అందించడం జరిగింది. ఆ మేరకు సహకరిస్తే మెరుగైన ఆరోగ్యం అందుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు పోవద్దని, ఎక్కడ అవసరమైతే అక్కడ మెడికల్ క్యాంపులో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్దన్ రావు, వైద్య సిబ్బంది మల్లేశ్వరి, స్వరూపరాణులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

**కలసపాడు, డిసెంబర్ 26 ప్రభాత వార్త:**



కలసపాడు మండలానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముగ్గురికి 1,26,600 రావడం జరిగింది. ఈ సీఎం రిలీఫ్ ఫండ్ శుక్రవారం మాదిరాజు శ్రీలక్ష్మి 20600 కలసపాడు, పోకల చిన్న సుబ్బయ్య 70000, చింతల పల్లె, ఏకపత్తుని విజయలక్ష్మి 36000 లింగారెడ్డి పల్లె మాజీ శాసనసభ్యురాలు విజయమ్మ, టిడిపి ఇన్చార్జి రితీష్ రెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కలిసి పాడు టీడీపీ గ్రామ కమిటీ ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ రెడ్డి, అప్పర్ సాగిలేరు ప్రాజెక్ట్ చైర్మన్ పట్టాభి రెడ్డి లు పాల్గొన్నారు.

## విభజనను వ్యతిరేకించిన గ్రామస్తులు

**ముద్దనూరు,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



మండలంలోని నొస్సం వారి పల్లె గ్రామాన్ని శుక్రవారం పంచాయతీ సెక్రెటరీ గ్రామ విలీనం కొరకు గ్రామ సభ ఏర్పాటు చేశారు, వివరాల్లో కెళితే పెనకలపాడు పంచాయతీలో ఉన్న నొస్సం వారి పల్లె గ్రామాన్ని, రాఘవాపురం, నొస్సం వారి పల్లె రెండు గ్రామాలను కలిపి ఒక పంచాయతీగా ఏర్పాటు చేయాలని అధికారులు ఏర్పాటు చేసిన గ్రామసభలో నొసం వారిపల్లె గ్రామస్తులు ముక్తకంఠంగా మా గ్రామాన్ని ముందు ఉండే విధంగా పెనికలపాడు పంచాయతీలోనే ఉంచాలని ఏకకంఠంగా వ్యతిరేకించినట్లు గ్రామస్తులు తెలిపారు.

## మైక్రోసాఫ్ట్ పెట్టుబడులు రాయలసీమలో పెట్టాలి

**కడప కార్పొరేషన్ డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



రాయలేలిన రతనాలసీమలో నేడు రాయలసీమగా మారింది. సాగునీటి కొరతతో పంట దిగుబడి లేక రైతన్నలు అప్పుల ఊబిలో ఉన్నారు. చదువుకున్న యువత ఉన్నప్పటికీ ఉద్యోగాలు లేక ఇప్పటికి తల్లిదండ్రుల మీద ఆధార పడాల్సిన పరిస్థితి ఉన్నది. పేదరికంతో పాటుగా నిరుద్యోగం సీమలో తాండవిస్తుందనీ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి చింతా మోహన్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం కడప ప్రెస్ క్లబ్లో విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల నుంచి 7 మంది ముఖ్య మంత్రులను అందించినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని, సీమ ప్రాంతంలో నిరుత్సాహ పరిస్థితి ఉన్నదని, మైక్రోసాఫ్ట్ సీఈఓ అండ్ చైర్మన్ సత్య నాదెండ్ల రూ.10 లక్షల కోట్లు పెట్టుబడి దేశంలో పెడు తున్నారని వెల్లడించారు. ఈ పెట్టుబడులు సీమలో పెడితే రాయలసీమ జిల్లాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవి, గోపి పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్‌గా శ్రీలేఖ

**సిద్ధవటం డిసెంబర్ 26 ప్రభాతవార్త**



సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ గా తమ్మిశెట్టి శ్రీలేఖ నియమితులయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నా వంతుగా రైతులకు అందుబాటులో ఉండి రైతుల సమస్యల కోసం కృషి చేస్తానని ఈ పదవి రావడానికి ఎంతగానో కృషి చేసిన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు జనసేన పార్టీ యువనేత దేరంగుల శ్రీకాంత్ శుక్రవారం మండలంలోని మాధవరం 1 రామకృష్ణాపురం తన నివాసంలో మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతి కారి కృష్ణ ఆధ్వర్యంలో కూటమి పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తామనిరాబోయే స్థానిక ఎలక్షన్లో కూటమి పార్టీ విజయభేరి తప్పదని అన్నారు.

## కిరాయి అంతకులపై కేసు నమోదు...

**ఎర్రగుంట్ల,డిసెంబర్ 26 ప్రభాతవార్త:**



తొండూరు మండలానికి చెందిన పైడిపల్లి కిషోర్ ఈ ఏడాది జులై నెలలో ముదునూరు పట్టణ సమీపంలోని బ్రిడ్జి కింద రైల్వే పట్టాలపై ఇతర ప్రదేశంలో పథకం ప్రకారం కిరాయి అంతకులు హత్య చేసి రైల్వే పట్టాలపై పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ఎర్రగుంట్ల సీఐ సుధాకర్ రెడ్డి ఎస్సై భాస్కర్ రెడ్డి, శుక్రవారం విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలలోకెళితే తొండూరు మండలానికి చెందిన జిల్లా మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ మెంబర్ పైడిపల్లె కిషోర్ ఓ మహిళతో అక్రమ సంబంధం కలిగి ఉన్నాడని సదురు మహిళ భర్త కిరాయి అంతకులతో పది లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని పథకం ప్రకారం హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. నరసింహులు, కిరణ్, కార్తీక్ మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరైనా వ్యక్తిగత కారణాలతో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కేసు చేదించడంలో కృషిచేసిన రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగాంజనేయులు సాదక్ వల్లి కానిస్టేబుల్ సర్వేశ్వర్ రెడ్డి వీరనారాయణ మల్లికార్జునలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ముంచేందుకు, దోచుకునేందుకు వైకాపాకే అర్హత

**రాజంపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త**



పదవుల కోసం ప్రాంతాన్ని గొంతు కోసే అర్హత మీకే ఉంది. పదవుల కోసం,డబ్బుల కోసం, పనుల కోసం అమ్ముడుపోయి రాజంపేట ను నాశనం చేశారు.దేవుని స్థలాలు కూడా కొట్టేసే అర్హత మీకే ఉంది. కుటుంబ సభ్యుల పేరుతో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఎస్టేట్లుగా తయారు చేసుకునే అర్హతలు మీకే ఉన్నాయి. మీకున్న అర్హత మాకు ఎక్కడ వస్తుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి దొంతం శివప్రసాద్ వైసిపి నేతలపై ధ్వజమెత్తారు. రాజంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ప్రజలను ముంచాలన్న, దోచుకోవాలన్న అర్హత వైకాపాదేనని విమర్శించారు.మిమ్మల్ని విమర్శించాలంటే కబ్జాలు చేసే అర్హత కావాలని ఎద్దేవా చేశారు.టిడిపి ఇన్చార్జ్ చమర్తికి మీకున్న అర్హతలు లేవని,అధికార పార్టీలో ఉండి కూడా జిల్లా కేంద్రం కావాలని అడుగుతున్నారనీ గుర్తు చేశారు. జగన్ రాజుకు రాజంపేట మీద ప్రేమ లేదు అంటున్నారు కదా మరి రాజంపేట ప్రాత గొంతు కోసి రాయచోటి జిల్లా కేంద్రం చేసినప్పుడు కనీసం జిల్లా కేంద్రం కావాలని జగన్ రెడ్డి దగ్గరకు వెళ్ళి వినతి పత్రం అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. దమ్ముంటే రాజంపేటలో వైసీపీ రాజంపేట అన్యాయం చేయలేదు అని చెప్పగలరా అని ప్రశ్నించారు. అర్హతల గురించి మాట్లాడే ముందు రాజకీయాలలో ఎటువంటి అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు లేని క్లీన్ ఇమేజ్ ఉన్న చమర్తి జగన్ మోహన్ రాజును విమర్శించే అర్హత వైకాపా నేతలకి లేదన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ళ చంద్రమౌళి, రాజంపేట క్లస్టర్ ఇంచార్జ్ అడపాల శ్రీనివాసులు, షేక్ కరీం, ఎస్సీ సెల్ నేత మందా శ్రీనివాసులు, రాంనగర్ నరసింహ పాల్గొన్నారు.

## మద్యం, బర్రెలు కేసులో ముగ్గురు వ్యక్తులు అరెస్ట్

**సిద్ధవటం,డిసెంబర్ 26 ప్రభాతవార్త**

చింతకొమ్మదిన్నె, బలిజపల్లి గ్రామానికి చెందిన ఇద్దరి పాడి రైతులకు చెందిన 10 బర్రెలు 60 అక్రమ మద్యం స్వాధీనం చేసుకొని ముగ్గులు వ్యక్తులపై కేసు నమోదు నమోదు చేశావని కడప డిఎస్పి వెంకటేశ్వర్లు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్ నందు పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కడప చెన్నై జాతీయ రహదారి కనుమల్లోపల్లి వద్ద, బలిజపల్లి గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, నాగార్జున అనే ఇరువురు పాడి రైతులు బుధవారం గేదెలు మేపు కొని కట్టేసి ఉండగా గేదెల తలుగు తాళ్ళు తెంచి దొంగతనంగా తోలు కెళ్ళి ఇతర ప్రాంతాలకు తరలించిన ఘటనపై దర్యాప్తు లో భాగంగా చాముండేశ్వరి పేట తనిఖీలు చేపటగా, నేకనాపురం క్రాస్ రోడ్ వద్ద గురువారం అక్రమ మద్యం విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులు జనార్ధన్, చప్పిడి, వెంకటేష్, చప్పిడి, నరసింహులు వద్ద ఉన్న 60 మద్యం లిక్కర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని విచారించగా పాడి రైతులకు చెందిన బర్రెలు దొంగలించామని దర్యాప్తులో రుజువు కావడంతో పాడి రైతులు సుబ్బరాయుడు, నాగార్జున ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు తరలింపు చేపట్టామని ఏ ,1 ముద్దాయి జనార్దన్ పై పలు పోలీస్ స్టేషన్లో 10 కేసులు నమోదయాయని అతనిపై పిడి, యాక్ట్ కేసు నమోదు కొరకై ఉన్నతాధికారులకు సిఫారస్ చేశామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్, నరసింహారాజు, ఎస్సై మహమ్మద్ రఫీ, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## పీపీపీ విధానం పై రాజకీయ విష ప్రచారం

**వేంపల్లి:డిసెంబర్ 26(ప్రభాత వార్త)**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న పీపీపీ విధానం పై కేవలం రాజకీయ పార్టీలు విష ప్రచారం చేయడం తప్ప అందులో వాస్తవం లేదని ప్రస్తుత పరిస్థితిలో పీపీపీ విధానం సరైనది అని కడప జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పీవీయెస్ వి ప్రసాదరావు ఒక ప్రకటన లో తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితి కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాని ఆశించిన స్థాయిలో లేదనేది వా స్తవం అని ప్రస్తుత పరిస్థితి లో అభివృద్ధి కార్యక్రమం జరగాలి అంటే ఏండ్లు పడతాయని అన్నారు. ఏ ఏటి కాయేడు బడ్జెట్ అంచనాలు పెరుగుతాయని ఇది అందరికి తెలిసిన విషయం అన్నారు. ప్రజల సమస్య లపై మాట్లాడవలసిన నాయకులు వాటిని విస్మరించి అభివృద్ధి కి తీసుకున్న నిర్ణయాలు ను విమర్శిస్తూ ప్రకటన లు చేయడం సరికాదని అన్నారు. రెండు సంవత్సరాలలో మెడికల్ కళాశాలలు వస్తే పేద విద్యార్థుల కు మెడికల్ విద్య అందుబాటులో కి వస్తుంది కదా అని ప్రశ్నించారు. పేద విద్యార్థులు మధ్య తరగతి వారు మెడిసిన్ చదవాలంటే త్వరిత గతిన కళాశాలలు అందుబాటులో కి రావలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అభివృద్ధి కి సహకరించాలి తప్ప రాజకీయ పార్టీ లు అడ్డుగా నిలిస్తే ప్రజలు క్షమించ రని అన్నారు. కోర్టు లు కూడా ఈ దేశం అభివృద్ధి జరగాలి అంటే పీపీపీ విధానం తప్పదని అంటుంటే మీరు వక్ర బుద్ధి తో ఆలోచన చేస్తే ప్రజలు గమనించగలరు అని రాజకీయ పార్టీ లు హుందా గా అభివృద్ధి కి మద్దతు. ఇవ్వాలని ఎన్నికల సమయం లో రాజకీయ లు చేయాలి గాని ప్రతి ఒక్కటి రాజకీయం చేయడం మంచిది కాదని అన్నారు.

## పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా అండ్లూరి నాగమునిరెడ్డి

**సిద్ధవటం డిసెంబర్26 ప్రభాతవార్త**



రాజంపేట నియోజకవర్గం సిద్ధవటం మండలం టక్కోలి గ్రామపంచాయతీకి చెందిన అండ్లూరి నాగమునిరెడ్డికి రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడిగా పదవి పొందడం జరిగింది ఈ సందర్భంగా పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నాగ మునిరెడ్డి మాట్లాడుతూ పదవి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి జగన్మోహన్ రాజు టిడిపి నాయకులకు కార్యకర్తలకు శ్రేయోబిలాషులకు ధన్యవాదాలు తెలిపారు.

## కలికిరి ఎస్సైగా పీవీ రమణయ్య

**కలికిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

కలికిరి పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా పీవీ రమణయ్యను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. వాల్మీకిపురం ఎస్సైగా పనిచేస్తున్న పీవీ రమణయ్యను కలికిరి ఎస్సైగా నియమించారు. ఎస్సై రమణయ్య పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లి, పోలీసు స్టేషన్ల పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహించి ప్రజల సమస్యల పట్ల మహిళల ఫిర్యాదు పట్ల ప్రత్యేక చొరవ చూపి వారి సమస్యలు పరిష్కరించారు. శుక్రవారం కలికిరి ఎస్సైగా పీవీ రమణయ్య తమ నియామక ఉత్తర్వులను కలికిరి సీఐ రామచంద్రకు అందించి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే బిజీ బిజీ

**కలికిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**



ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి శుక్రవారం నగిరిపల్లిలోని తన స్వగృహంలో బిజీ బిజీగా గడిపారు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో నగిరిపల్లికి చేరుకొని తమ సమస్యలను ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సమస్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పని చేయాలని అధికారులను ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గ్రామాల్లో ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడే వెలుగు కార్యాలయంలో సమావేశం

**కలికిరి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

కలికిరి వెలుగు కార్యాలయంలో శనివారం ఇండస్ట్రియల్ డిపార్ట్‌మెంట్ వారితో సంఘసభ్యులకు పీఎంఈజీపీ రుణాలపై సమావేశం జరుగుతుందని వెలుగు ఏపీఎం దేవసేన తెలిపారు. ఈ సమావేశంలో సంఘ సభ్యులు ఉద్యమం ఆధార్ సర్టిఫికెట్లు తీసుకోవచ్చన్నారు. అదే విధంగా పీఎంఈజీపీ రుణాలు కావాల్సిన వారు కార్యాలయానికి కచ్చితంగారావాలన్నారు. ఈ రుణాలపై 35% సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ సమావేశం సంబంధించి సంఘమిత్రలు, వీవో లీడర్లు, సంఘ సభ్యులకు తెలిపి సమావేశానికి హాజరయ్యేలా చూడాలని వెలుగు ఏపీఎం కోరారు. సమావేశానికి హాజరయ్యే సభ్యులు వారి ఆధార్, పాన్, బ్యాంకు పాసుపుస్తకం తీసుకురావాలని దేవసేన తెలిపారు.

## పేదల పక్షపాతి సిపిఐ..

**వేంపల్లి : డిసెంబర్ 26 (ప్రభాత వార్త)**



సిపిఐ 100 వసంతాల వేడుకలు త్యాగాలు, పోరాటాల ప్రజాప్రస్థాన స్ఫూర్తితో సిపిఐ 101 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి చంద్రశేఖర్, కే.సి.బాదుల్లా వేంపల్లి పట్టణంలో అడ్డ రోడ్డు బాయ్స్ హై స్కూల్ వద్ద జెండా ఆవిష్కరించారు అనంతరం సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీలు సిపిఐ కాంగ్రెస్ పార్టీలు మాత్రమేనన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న అనేక మంది త్యాగాలు చేశారని, జైలుకెళ్లారని, ప్రాణాలు సైతం తృణపాయంగా అర్పించారన్నారు. ఈ నేపథ్యంలో సిపిఐ వందేళ్ళ వార్షికోత్సవ ప్రజా ప్రస్థానం స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాలకు ప్రజలు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శులు కొత్త కాల్వ బ్రహ్మం అంజనప్ప సిపిఐ వేముల మండల కార్యదర్శి చాంద్ బాషా సిపిఐ వేంపల్లి నాయకులు అంజి ఏఐటీయూసీ నాయకులు మల్లేష్ చక్రధర్ పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ చరితార్థుడు,ఆర్థిక మాంత్రికుడు

**వేంపల్లి: డిసెంబర్ 26 (ప్రభాత వార్త)**



భారత మాజీ ప్రధాని పద్మ విభూషణ్ స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రపంచ చరిత్రలోనే ఒక విలక్షణమైన, విశిష్టమైన రాజకీయ నాయకుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసి రెడ్డి కొనియాడారు. శుక్రవారం వేంపల్లి లో స్వర్గీయ మన్మోహన్ సింగ్ ద్వితీయ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ మన్మోహన్ సింగ్ చరితార్థుడు,చరిత్రకారుడు కారణజన్ముడు అని కీర్తించారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం,ప్రసాద్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ, కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి,బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, వినయ్, బాల వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్ రంగా వర్ధంతి

**వేంపల్లె డిసెంబర్ 26 (ప్రభాత వార్త)**

దివంగత రాజకీయ నాయకుడు వంగవీటి మెహన్ రంగా వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బడుగు, బలహీన వర్గాల ఆశ జ్యోతి,ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలు సైతం అర్పించిన మహనీయుడు వంగవీటి మోహన్ రంగా అని దాసరి రవిశంకర్ కొనియాడారు.

## అర్బన్ ఎస్సైగా 2 ప్రణయ్ రెడ్డి

**పులివెందుల,డిసెంబర్ 26 , ప్రభాత వార్త :**

పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ నందు అర్బన్ ఎస్ఐ 2 గా జి. ప్రణయ్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు డి ఐ జీ సూచన మేరకు జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు శుక్రవారం అర్బన్ స్టేషన్ నందు బాధ్యులు చేపట్టారు. పిఎస్ఐగా ఒంటిమిట్ట నందు పనిచేస్తూ బదిలీ పై ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ కు పూర్తి స్థాయి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ప్రణయ్ రెడ్డి నీ పులివెందుల స్టేషన్‌కు బదిలీ చేయడంతో అర్బన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టబద్ధంగా ఉంటానన్నారు.


### మదనపల్లె పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.1146/A1/2011 తేది: .12.2025

**7వ టెండర్ కమ్ అక్షన్ నోటీసు**

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన వివిధ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు క్రింద తెలిపిన ఖాళీగా వున్న షాపు రూములను G.O.M.S.No.68 (MA&UD) ది: 31.05.2024 నందలి ఆదేశముల ప్రకారము నెలసరి అద్దెపై లీజుకు ఇచ్చుటకు ది:12.01.2026 తేదిన TENDER CUM AUCTION కార్యక్రమములో భాగంగా టెండరు నిర్వహించబడును. కావున సదరు TENDER CUM ACTION నందు పాల్గొనదలచిన వారు ది: 02.01.2026లోగ టెండరు రుసుము రూ.100/-లను మున్సిపల్ ఖజానాలో చెల్లించి, మదనపల్లె పురపాలక సంఘం చే జారీ చేయబడిన టెండరు షెడ్యూలును ది:02.01.2026వ తేది మధ్యాహ్నం 3.00 గం॥లు లోగా దాఖలు చేయవలెను. టెండరు దాఖలు పరచిన తదుపరి, టెండరు దారుల సమక్షంలో టెండర్లు తెరచి అదే రోజు బహిరంగ వేలము నిర్వహించబడును. ఒకటికన్న ఎక్కువ షాపు రూములు కావలసిన వారు ఒక్కొక్క షాపుకు ఒక్కొక్కటి విడివిడిగా టెండరు దాఖలు చేయవలెను.

| వ. నెం. | ఏరియా/ కాంప్లెక్స్ | మొత్తం | ఖాళీగా ఉన్న షాపురూముల నెంబర్లు (3వ సారి) |
|---|---|---|---|
| 1 | జి.కే.వీది | 13 | 27,27A,28A,29,29A,30,31, 33(SC),33A(SC), 34,35,39,40 |
| 2. | ముగ్గురాళ్ళ వంక | 10 | 32,34,37,38,44,45,51,53,63,64 |
| 3. | చిత్తూరు బస్టాండు | 17 | 9(PH),10,11,16(SC),17,18,19, 20,22 (SC),24,26,27(SC),28,29,30,33(PH), Toilet rooms |
| 4. | బెంగుళూరు బస్టాండు | 04 | 35A, 36A,38A,40(SC),46A(SC) |
| 5. | కో-ఆప్ కాలనీ | 04 | 5,08,09(ST),10 |
| 6. | సుబాష్ రోడ్డు | 01 | 1 |
| 7. | కొత్తగా నిర్మించిన చిత్తూరు బస్టాండ్ | 01 | 03 |
| మొత్తం | | 50 | |

1. దిగువ షాపు రూములు సాల్వెన్సీ రూ.1,00,000/-లు మరియు రూ.50,000/-లకు ధరావత్తును, కమిషనరు వారి పేరు పై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
2. మొదటి అంతస్తు షాపు రూములు సాల్వెన్సీ రూ.50,000/-లు మరియు రూ.25,000/-లకు ధరావత్తును, కమిషనరు వారి పేరుపై డిమాండు డ్రాఫ్టును (చెక్కులు తీసుకోబడవు) సమర్పించవలెను.
3. టెండరు ఫారముపై నెలసరి అద్దెను స్పష్టముగా అంకెలులోను మరియు అక్షరములోను తప్పునిసరిగా వ్రాయవలెను.
4. నెలసరి అద్దెపై ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు 18% శాతం GST అధనముగా చెల్లించవలసియుండును. ఇతర వివరములు, షరతులు కార్యాలయ పనివేళలయందు A1 వారిని సంప్రదించవచ్చును.

కమిషనరు
మదనపల్లె పురపాలక సంఘము

## తూర్పు పాఠశాలలో వీర్ బాల్ దివస్

రామసముద్రం డిసెంబర్ 25 ప్రభాతవార్త



మండల కేంద్రంలో దిగువ పేట వద్ద యున్న తూర్పు పాఠశాల హెచ్ ఎం హేమలత ఆధ్వర్యంలో వీర్ బాల్ దివస్ 2025 వేడుకలు శుక్రవారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిధిలుగా రామసముద్రం పంచాయతీ సెక్రటరీ మునిస్వామినాయక్ పాల్గొని విద్యార్థుల ప్రతిభను వీక్షించారు. మునిస్వామి నాయక్ మాట్లాడుతూ ఈ తూర్పు పాఠశాలవిద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలచూసి నాకు చాలా సంతోషం ఆవుతున్నదని ఇదే పట్టుదలతో బాగా చదివి మీ తల్లి దండ్రులకు, మీకు విద్యా బోధన చేసిన గురువులకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పంచాయతీ సెక్రటరీ చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మునిస్వామినాయక్, హెచ్ఎం హేమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో అధికారుల తనిఖీ

మదనపల్లెక్రైమ్, డిసెంబర్ 26 ప్రభాతవార్త.



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జెడి) కార్యాలయ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతం కళాశాల ప్రిన్సిపాల్గా బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణవేణి ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, ఈ తనిఖీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రిన్సిపాల్ కృష్ణవేణి నాలుగు సంవత్సరాలుగా ఈ కళాశాలలో సేవలందిస్తున్నారు. ఆమె పదవీకాలంలో జరిగిన పరిపాలనా పరమైన నిర్ణయాలు, ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పూర్తి రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల గురించి ఆర్జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ శివరాం మాట్లాడుతూ ప్రిన్సిపాల్ పదవీ విరమణ పొందుతున్న తరుణంలో ఇది సాధారణ ప్రక్రియలో భాగమేనని తెలిపారు. నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల ఫీజు వివరాలు మరియు ఇతర పరిపాలన రికార్డులను పరిశీలించామన్నారు. రికార్డుల పరిశీలన అనంతరం పూర్తి స్థాయి నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ కార్యాలయ సిబ్బంది మరియు కళాశాల పరిపాలన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్పై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 26 ప్రభాతవార్త.

కళాశాల అభివృద్ధి పనులకు సం బంధించిన నిధులు, వాటి ఖర్చులు, బిల్లులు, కమిటీ ఇతర వివరాలు స మాచార హక్కు చట్టం 2005 ప్రకా రం అడిగితే ఇంత వరకు సమాచా రం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిన ప్రి న్సిపాల్పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘం నాయకులు ఉత్తన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఉత్తన్న విలే కరులతో మాట్లాడుతూ ప్రిన్సిపాల్పై ఆర్.జె.డి, కమీషనర్లకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ప్రిన్సిపల్ తప్పుడు సమాచారం ఇచ్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజా, ఎరుకల మహిళా నాయకురాలు పి.వసంత, జనార్ద న్, అక్బర్, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

రామసముద్రం డిసెంబర్ 26 ప్రభాతవార్త



మండలంలోని ఎలవానెల్లూరు గ్రామపంచాయతీ దాసార్ల పల్లె గ్రామంలో శుక్రవారం ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియయను డిప్యూటీ ఎం పిడిఓ గఫూర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బందితో కలిసి పన్నులు వసూళ్ల వివరాలను సమీక్షించారు. గ్రామ పంచాయతీలో పేరుకు పోయిన పన్ను వసూళ్లను వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. అలాగే కురిజల గ్రామపంచాయతీ డోర్ టూ డోర్ గార్బెజ్ కలెక్షన్ ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ తనిఖీ చేసి గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రసాద్, సచివాలయం సిబ్బంది కార్మికులు పాల్గొన్నారు.

## డిసిసి బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ముద్దనూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



డిసిసి బ్యాంకు అందిస్తున్న దీర్ఘకాలిక రుణాలను మండల ప్రజలు రైతులు, విద్యార్థులకు అందిస్తున్న పొదుపు ఖాతాలపై శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కళాజాత బృందంతో విద్యార్థులకు నాటక రూపంలో అవగాహన కల్పించినట్లు సహకజిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఫీల్డ్ అధికారి సూపర్వైజర్ కళ్యాణ్ బాబు తెలిపారు. రైతు నేస్తం పథకం కింద వ్యక్తిగత, దీర్ఘకాలిక, పంట, బంగారం మరియు మహిళలకు స్వయం ఉపాధి సంఘాలు ద్వారా రుణాలు కిడ్స్ బ్యాంకు ద్వారా విద్యార్థులకు అందించు పొదుపు ఖాతాలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మిజనార్ధనస్వామి వారికి ప్రత్యేక పూజలు

రామసముద్రం డిసెంబర్ 26 ప్రభాతవార్త

మండల కేంద్రంలో కొలువైన శ్రీ లక్ష్మి జనార్ధన స్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసం సందర్భంగా 11వ రోజు స్వామివారిని ఆలయ అర్చకులు పార్థసారథి బటర్ కులశేఖర్ బటర్ అర్చకుల బృందం వారిచే వేకువ జామున స్వామివారిని సుప్రభాతం తో మేలుకొలిపి స్వామి వారిని పన్నీరు, తులసి దళంతో అభిషేకాలు,అర్చనలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో స్వామిని అలంకరణ చేసి సహస్రనామాలు నిర్వహించి విశేషపూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శన బాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

## మహనీయులకు నివాళులు

బద్వేలు, డిసెంబర్ 26, ప్రభాతవార్త



బలిజ కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పాలిటి పెన్నిధి వంగవీటి మోహనరంగా 37వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అలాగే తెలుగు చలనచిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకుని త్యాగశీలి, అభినవ దానకర్ణురాలిగా సేవ చేసిన మహానటి సావిత్రి 47వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె .ఆర్ టీమ్ ఆధ్వర్యంలో బద్వేలు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వృద్ధులు, వికలాంగులు, మహిళలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలుగా పెద్ది సుధాకర్, గణమంతు రాజేష్, కావలి చిన్ని, తోట రాము, అంకాని ప్రసాద్ తమ్ముడు రాము, జాండ్ల వరం వెంకటసుబ్బయ్య, తుడిమెల్ల వెంకట సురేష్, సహకరించారు. ఈ కార్యక్రమంలో బలిజ కుటుంబ సభ్యులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ యొక్క 101వ వ్యవస్థాపక దినోత్సవం ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలంలోని సిపిఎం పార్టీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.క్రిష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళీలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల నిరంకుశంకు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందన్నారు. సిపిఐ నాయకులు రెడ్డిశేఖర్, చంద్రశేఖర్, మాదవ్, సిద్దయ్య, గోపాల్, నీలావతి, రాజమ్మ, రమణమ్మ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

## భర్త వేధింపులకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ నిరసన

మదనపల్లె క్రైమ్ డిసెంబర్ 26 ప్రభాతవార్త.



కట్టుకున్న భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న భర్తపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మదనపల్లిలో ఏఐటీయూసీ నాయకులు నిరసన చేపట్టారు. బాధితురాలు జోయాఖాన్ ఎదుర్కొంటున్న వేధింపులపై నాయకులు తీవ్రంగా స్పందించారు. ఏఐటీయూసీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. జోయాఖాన్ ఆమె భర్త మెహబూబ్ ఖాన్ గత కొంతకాలంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధ్యత గల భర్తగా వ్యవహరించాల్సింది పోయి, ఇంటి కనీస అవసరాలకు కూడా ఆర్థిక వనరులు సమకూర్చకుండా గాలికి తిరుగుతున్నాడని వారు ఆరోపించారు. వేధింపులు భరించలేని స్థితిలో బాధితురాలు జోయాఖాన్ ఇప్పటికే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు నాయకులు వెల్లడించారు. వెంటనే పోలీసులు ఈ విషయంలో స్పందించి, బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితుడైన మెహబూబ్ ఖాన్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు.

## టిడిపిలో బడుగు, బలహీన మైనార్టీలకు పెద్దపీట

### మాజీ అధికార ప్రతినిధి ఆర్జె.వెంకటేష్

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



సన్మానిస్తున్న దృశ్యం

తెలుగుదేశం పార్టీలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు పెద్దపీట వేయడం జరుగుతుందని పార్లమెంటరీ మాజీ అధికార ప్రతినిధి ఆర్జె. వెంకటేష్ తెలిపారు. రాజంపేట పార్లమెంటరీ పరిధిలో పలు బాధ్యతలు చేపట్టిన వారికి శుక్రవారం పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్ఖాదర్ఖాన్, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు తలారి రాధ, పి.చంద్రమోహన్రెడ్డి, పార్లమెంటరీ అధికార ప్రతినిధి విజయమ్మ, మీడియా కోఆర్డినేటర్ శ్రీపతిలకు ఆయన శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటరీ పరిధిలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధికోసం శాయశక్తులగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాటకొండ మధుబాబు, ఉషా, గణేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రిని కలిసిన వైకాపా నాయకులు

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



మాజీ మంత్రితో కలిసిన నాయకులు

మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ నిస్సార్అహ్మద్ నాయకులతో కలసి శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో మున్సిపాలిటిలో జరగబోయే ఎన్నికల గురించి ఆయన దృష్టికి తెచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో వైకాపా గెలుపొందేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి మాజీ మంత్రితో చర్చించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు అనూషారెడ్డి, శ్రీనాథ్రెడ్డి, దండాల రవిచంద్రారెడ్డి, భాస్కర్రెడ్డి, వేణుగోపాల్రెడ్డి, మల్లికార్జునరెడ్డి, యూనస్, కౌన్సిలర్ ఈశ్వర్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిచే ఘనంగా వీర్ బాల దినోత్సవం

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాదవ్, జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ సూచనలతో శుక్రవారం శ్రీక్రిష్ణచైతన్య ఫార్మసి కళాశాలలో వీర్ బాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి నాయకులు డాక్టర్ అజంతుల్లాఖాన్, బర్నేపల్లి రవి కుమార్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబాజోరవర్ సింగ్ను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. దేశం కోసం, ధర్మకోసం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. కళాశాల ఛైర్మెన్ శశివర్ధన్రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకొని ఈ దేశం కోసం వారిలాగే భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు.

## విద్యుత్ సర్క్యూట్తో బార్బర్షాపు దగ్ధం

### రూ. 2లక్షలు ఆస్థినష్టం

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



విద్యుత్ సర్క్యూట్తో బార్బర్షాపు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల రుపాయలకు పైగా ఆస్థినష్టం సంబవించినట్లు నిర్వాహకులు రమణ తెలిపారు. పట్టణంలోని శ్రీక్రిష్ణ థియేటర్, భారతి స్టూడియో పక్కన ఉన్న అఖిల్ మెన్స్ బ్యూటీపార్లర్, బార్బర్ షాపు గురువారం రాత్రి విద్యుత్ సర్క్యూట్కు గురై పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో షాపులోని పర్నీచర్స్, ఫాన్స్, టీవి, ఇన్వైటర్, విద్యుత్ పరికరాలు, బార్బర్ పనిముట్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన నిర్వాహకులు బార్బర్ రమణను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. విద్యుత్ వైర్లు నిర్వాహకం వల్లే సర్క్యూట్ జరిగి ఉంటుందని పలువురు అబిప్రాయపడుతున్నారు.

## లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి

మదనపల్లె, డిసెంబర్ 26 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని అనపగుట్ట శ్రీవారినగర్లో వెలసియున్న శ్రీ అభయ లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఈనెల 30న మంగళవారం వైకుంఠ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, ప్రధాన అర్చకులు రమేష్స్వామి తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు ఉదయం 5గంటలకు లక్ష్మీనరసింహాస్వామి దర్శనం ఉంటుందన్నారు. భక్తాదులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా ఆయన తెలిపారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు.

## ఎస్సై ను సన్మానించిన టిడిపి నేతలు

తంబళ్లపల్లె డిసెంబర్ 26. ప్రభాతవార్త :



నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తంబళ్లపల్లె ఎస్సై అనిల్ కుమార్ను తంబళ్లపల్లె టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత టిడిపి ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర ఆధ్వర్యంలో ఎస్సైను సత్కరించి శుభాకాంక్షలు అందజేశారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించగా ఆయన స్పందించి అందరి సహకారంతో నేర రహిత మండలంగా తయారు చేయడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రెడ్డి, సోమశేఖర్, మీసాల భాస్కర్ నాయుడు, శివరాం,జయరామిరెడ్డి, ధనశేఖర్, జగదీష్, భాస్కర్,రామచంద్ర, శ్రీనివాసులు,ఆనంద రెడ్డి, జనసేన నాయకులు మురళి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలన

ములకలచెరువు, డిసెంబర్26, ప్రభాతవార్త:



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర క్రైమ్ రికార్డులను పరిశీలించారు. అంతేకాకుండా గతంలో కంటే ప్రస్తుత క్రైమ్ వివరాలను సీఐ వెంకటేశ్వర్లు ను అడిగి తెలుసుకున్నారు. రానున్న సంక్రాంతి పండుగకు గ్రామాల్లో కోడి పందాలు, పేకాట జూదాలపై నిఘా ఉంచి అరికట్టాలన్నారు. అతిక్రమించి ఆ లాంటి కార్యక్రమాలను ప్రోత్సహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యల ను అడగారు. దీంతో వారు ఉన్న సమస్యలను డీఎస్పీకి వివరించారు. స్థానిక మూడు రోడ్ల కూడలలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని తెలపగా అక్కడ హోం గార్డు ఏర్పాటు చేయాల్సిందిగా సిఐకి ఆదేశించారు. మరియు టమోటా మార్కెట్ యార్డ్ నందు బీహార్ కు చెందిన వ్యక్తులు వచ్చారని వారి వద్ద నుంచి మం డి యజమానులు ఆధార్ కార్డులు తీసుకొని పనిలో ఉంచు కోవాలని తెలిపారు. దీంతో వారు ఏ తప్పు చేసి వెళ్లిన సునాయాసంగా గుర్తించే అవకాశం ఉందని విలేకరులు తెలియజేశారు. స్పందించిన డి.ఎస్.పి జనవరి మొదటి వారంలో మం డి యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి వారు ఎక్కడి నుంచి వచ్చారు. వారి అడ్రస్సులు ఎక్కడ అని తెలుసుకొని పనిలో ఉంచు కోవాలని ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

## భూవివాదంలో ఘర్షణ 8 మందికి గాయాలు

రైల్వేకోడూరు డిసెంబర్ 26(ప్రభాతవార్త )



రైల్వేకోడూరు మండలంలోని లక్ష్మీ ప్యారడైజ్ సమీపంలో ని తులసి స్కూల్ పక్కన ఉన్న ఒక ప్రైవేటు భూమి వ్యవహారంలో అగ్రవర్ణాలు మరియు అరుంధతీలకు జరిగిన ఘర్షణలో 8 మందికి గాయాలు అయినట్లు స్థానిక పోలీసులు తెలిపారు బాధితుల వివరాల మేరకు సర్వేనెంబర్ 713 నందు భూములు ను సంబంధిత అధికారులు ఈ మధ్యనే వారికి కేటాయించిన భూములను సర్వే చేయించి హద్దులు చూపించిన నేపథ్యంలో శుక్రవారం సరిహద్దులు చూసుకుంటున్న సందర్భంలో అరుంధతిలో ఏకతాటిక రాళ్లతోనూ కట్టెలతోనూ విచక్షణ రహితంగా దాడులు చేసినట్లు సంబంధిత బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు గత 20 సంవత్సరాలుగా ఈ భూమిపై పోరాటాలు చేస్తుండగా ఎటికేలకు శుక్రవారం మధ్యాహ్న సమయంలో పూర్తిస్థాయిలో అగ్రవర్ణాలకు అరుంధతిలకు ఘర్షణ జరిగింది గాయపడిన బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టినందుకు కోడూరు పోలీసులు తెలిపారు.

## సచివాలయాన్ని సందర్శించిన జనసేన పార్టీ ఇంచార్జ్

ములకలచెరువు, డిసెంబర్26, ప్రభాతవార్త:

మండలంలోని దేవు ల చెరువు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం తంబళ్లపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనగ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సిసి రోడ్లు, వీధి దీపాలు, మురికినీటి కాలువలు, త్రాగు నీటి సమస్య లు ఉన్నాయని ఆయన దృష్టికి గ్రామస్తులు తెలిపారు. దీంతో ఆయన స్పందించి ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గంగా చూస్తానని గ్రామస్తులు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు, కూటమీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు మెగా రక్తదాన శిబిరం

ములకలచెరువు, డిసెంబర్26, ప్రభాతవార్త:

మనం సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం మె గా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహ కులు కోనంగి హరిబాబు తెలిపారు. స్థానిక నాయన చెరువు పల్లె రోడ్డులో ఉ న్న క్రికెట్ గ్రౌండ్ నందు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు తెలియజేశారు. ఆసక్తిగల యువకులు, స్థానికులు , ఆటో డ్రైవర్లు, ఆసక్తి గలవారు రక్తదానాన్ని దానం చేసి, రక్తం కావలసిన వారికి అండగా ఉండి వారి ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మానవతా దృక్పథంతో ఆసక్తిగల ప్రతి ఒక్కరు రక్తదానాన్ని ఇవ్వాలని నిర్వాకుడు హరి కోరారు.

## ములకలచెరువు ఎస్ఐగా ప్రతాప్ బాధ్యతలు స్వీకరణ

ములకలచెరువు డిసెంబర్ 26 ప్రభాతవార్త

ములకలచెరువు ఎస్ఐగా ప్రతాప్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. మొలకలచెరువు ఎస్ఐగా పనిచేస్తున్న నరసింహుడు బదిలీపై రాయచోటికి వెళ్లగా ఆయన స్థానంలో నంద్యాల ఎస్సైగా పనిచేస్తున్న ప్రతాప్ బదిలీపై రాయచోటి విఆర్ కు వచ్చారు. రాయచోటి విఆర్ నుంచి ములకలచెరువు ఎస్ఐకి బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా మండలంలో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. కోడి పందెం, పేకాట వంటి జూదలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తానన్నారు.

## 100 వసంతాల వేడుకలు

మైదుకూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:



భారత దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ భారత్ దేశాన్ని బ్రిటిష్ పాలకులు పరిపాలన కొనసాగిస్తున్న సమయంలో 1925 డిసెంబర్ 26వ తేదీ ఆవిర్భవించిందని భారతదేశానికి సంపూర్ణ స్వతంత్రం కావాలని నిర్ణయించిన మొదటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని నాటినుండి నేటి వరకు 100 సంవత్సరాలుగా జనం కోసం ప్రజల హక్కుల రక్షణ కోసం విద్యార్థి, యువజన, కార్మిక,మహిళా సంఘాలుగా ఏర్పడి వారి కోసం అహర్నిశలు పోరాటాన్ని నడుపుతున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని స్థానిక కడప రోడ్డు అంబేద్కర్ కూడలి లో మరియు వీణ విజయరామరాజు కాలనీలో జెండా ఆవిష్కరణ చేసి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మైదుకూరు ఇంచార్జ్ ఎల్.నాగ సుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఈ.శ్రీరాములు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్.షావలి మాట్లాడుతూ భూమి కోసం ఇంటి జాగా కోసం రేషన్ కార్డుల కోసం పింఛన్ల కోసం అన్ని రంగాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కలిసివచ్చే ప్రజా సంఘాలతో వాము పక్ష పార్టీలతో కలిసి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి భారత కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, పీరయ్య, రవి, లక్ష్మయ్య, పివి రమణమ్మ, సుబ్బమ్మ, బషీరున్, చైతన్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలో కష్టపడిన వారికి మంచి స్థానం కల్పిస్తాం

పోరుమామిళ్ల రూరల్, డిసెంబర్ 26 ప్రభాత వార్త:



ఇటీవల జరిగిన పార్లమెంట్ కమిటీలో బద్వేల్ నియోజకవర్గం పోరుమామిళ్ల మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు సీతా వెంకటసుబ్బయ్య ను పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ గా, పార్లమెంట్ సెక్రటరీగా నియమితులైన బొజ్జ అరుణరాణి లను బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారిని సూచించారు. ఈ సందర్భంగా నియమితులైన బొజ్జ అరుణరాణి మాట్లాడుతూ తమపై నమ్మకంతో జిల్లాస్థాయి రావడానికి కృషి చేసిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వారన్నారు. వారితో పాటు పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలపై నిరసన

ఎడ్యుకేషన్ డిసెంబర్ 26 ప్రభాతవార్త :



పర్లపాడు గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై క్రమశిక్షణాత్మక చర్యలు చేపట్టాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా పంచాయతీ అధికారిపై నిరసన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ పంచాయతీకార్యదర్శి నిధులను దుర్వినియోగం చేశారని డిసెంబర్ 17న జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ పది రోజులు గడిచినా ఎటువంటి విచారణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని పంచాయతీ సెక్రటరీతో పాటు నిర్లక్ష్యం వహించిన జిల్లా పంచాయతీ అధికారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, అవినీతి అక్రమాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నాయకులు లింగమయ్యతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## 14వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

రైల్వేకోడూరు డిసెంబర్ 26(ప్రభాతవార్త



రాజంపేట సాధన కోసం రైల్వే కోడూరులో ఈ జెఏసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష దాదాపు 14 రోజులకు చేరింది శుక్రవారం స్థానిక పట్టణానికి చెందిన భక్త భజన బృందం రిలే నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఈజేఏసీ అధ్యక్షులు ముత్యాల పెంచలయ్య ఎస్ఎన్ శ్రీనివాసులు ఎన్ వి కుమార్ ఆదర్శ చంగల్ రాజు శ్రీనివాసరాజు బాబు నారాయణ వర్మ శిరిడి సాయి కళాశాల అధినేత చంగల్ రాజు రత్నం ల ఆధ్వర్యంలో భారీ ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా అన్ని రంగాలలో రాజంపేట అందరికీ అనువైన కేంద్రమని అందుకు అధిష్టానం పాలకవర్గం రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని వారు డిమాండ్ చేశారు. పూర్తిగా రాయచోటికి వెళ్లాలంటే ఎన్నో ప్రయాసలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రిని దృష్టిసాదించి రాజంపేట జిల్లా కేంద్రం చేసి రైల్వే కోడూరు ప్రజల అభ్యర్థన ఆలకించాలని వారు డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులకు అడ్డుపడడం భావ్యం కాదు

తంబళ్లపల్లె డిసెంబర్ 25 ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వంలో మంజూరయిన అభివృద్ధి పనులను అడ్డుకోవడం భావ్యం కాదని తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ హితవు పలికారు. శుక్రవారం పంచాలమర్రిలో మంజూరైన మినీ పంచాయతీ భవన నిర్మాణ స్థల వివాదంపై ఆయన ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపారు. భవన నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం ప్రభుత్వందని అందులో నిర్మాణం చేపడుతుంటే కొందరు అడ్డుపడడం పై రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు ఇదివరకే విచారణ చేసి అది ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. అయితే కొందరు అక్కడ ఆక్రమణకు పాల్పడిన విషయం తెలుసుకున్న సాయినాథ్ ఇరు వర్గాలతో చర్చించి పంచాయతీ అభివృద్ధి కోసం నిర్మిస్తున్న భవనాన్ని అడ్డుకోరాదని రెవెన్యూ అధికారులు మండల పరిషత్ అధికారుల సూచన మేరకు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఆయన వెంట మండల జనసేన రథసారథి ఎద్దుల నరసింహులు, సిద్ధమల్ రెడ్డి, మురళీకృష్ణ, టిడిపి నాయకులు ఆనంద్ రెడ్డి, రాఘవరెడ్డి, రామచంద్ర, బిజెపి నాయకులు రామస్వామిరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

లక్కిరెడ్డిపల్లి; డిసెంబర్ 26, ప్రభాత వార్త



సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై డి శోభ పేర్కొన్నారు శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో సైబర్ నేరాలు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా కిశోర్ బాలికలు బ్యాడ్ టచ్ గుడ్డు టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు అంతే కాకుండా ఏదైనా మగ పిల్లవాళ్ళు ఏడిపిస్తే వెంటనే 100 కానీ పోలీసులు వెంటనే తెలియజేయనున్నారు కష్టపడి చదివితే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె విద్యార్థులకు సూచించారు 9 10 ఇంటర్మీడియట్ తరగతుల్లో సక్రమంగా చదువుపై దృష్టి పెడితే గొప్ప ప్రయోజకులవుతారని ఆమె తెలియజేశారు. ఇంస్టాగ్రామ్ ఫేస్బుక్ వాట్సాప్ నుండి సెల్ ఫోన్లను పూర్తిస్థాయిలో దూరంగా ఉంచాలన్నారు కష్టపడి చదివినప్పుడే పాఠశాలకు తల్లిదండ్రులకు అందరికీ మంచి పేరు వస్తుందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరాల రమేష్ అధ్యాపకులు నాగయ్య రామ్మోహన్ శివరామకృష్ణ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సైకు బాలాజీ డైరీ, క్యాలెండర్ బహుకరణ

తంబళ్లపల్లె డిసెంబర్ 26 ప్రభాతవార్త :

తంబళ్లపల్లె ఎస్సై అనిల్ కు మార్కు టిడిపి మండల అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి కోసువారిపల్లెలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ టీటీడీకి చెందిన డైరీ తోపాటు నూతన సంవత్సర క్యాలెండర్ను బహుకరించారు. శుక్రవారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి మండలంలో అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి సహకరించాలన్నారు. ఎస్సై వారిని అభినందించి మండలంలో నేర రహిత సమాజానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి నాయుడు, ముద్దలదొడ్డి వెంకటరెడ్డి, పురుషోత్తం,మాజీ జడ్పిటిసి రామచంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ లు బేరి శ్రీనివాసులు, కాలా నారాయణ,తెలుగు యువత ఉపాధ్యక్షుడు నరసింహులు, సోమశేఖర్,బురుజు వెంకటరమణ,మాజీ సర్పంచ్ సుధాకర్, జనసేన మండల నాయకుడు ఎద్దుల నరసింహులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాటూరులో వెంకటేశ్వర స్వామి కళ్యాణం

నందలూరు, డిసెంబర్ 26 ప్రభాతవార్త:

మండలంలోని పాటూరు గ్రామపంచాయతీలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30వ తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీదేవి-భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త యల్లమరాజు శ్రీనివాస రాజు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల మధ్య స్వామివారి కళ్యాణం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

## సిజిసి అవార్డు గ్రహితని అభినందించిన ఎస్పీ

పోరుమామిళ్ల రూరల్, డిసెంబర్ 26 ప్రభాతవార్త:



కొండపేట గ్రామానికి చెందిన పాలకొనను నారాయణరెడ్డి కుమారుడు నావి ఉద్యోగి రమణారెడ్డి వారి సిబ్బందితో సాహసపేతంగా పాకిస్తాన్ సముద్ర జలాల్లో చిక్కుకున్న మన దేశ జాలర్లను రక్షించాడు. దానిని గుర్తించి భారత ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిజిసి మెడలను బహుకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శుక్రవారం కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ రమణారెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. తెలుగు రాష్ట్రాల్లో కడప జిల్లా నుండి ఏకైక వ్యక్తిగా గుర్తింపు పొందడం సంతోషకరమన్నారు. ఇలాంటి మరెన్నో అవార్డులు అందుకోవాలని సూచించారు.. ఆయనతోపాటు తన తండ్రి నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# రాజంపేట జిల్లా కేంద్రంగా చేసి వైసిపి చేసిన తప్పు సరిదిద్దాలి

## అన్నమయ్యా ...నీ జిల్లాను నీవే తెచ్చుకో... 108 అడుగుల విగ్రహం వద్ద వినూత్నంగా నిరసన



17రోజు దీక్షలలో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు




జిల్లా కేంద్రం కోసం అన్నమయ్య విగ్రహం వద్దకు తరలివచ్చిన జనం

**రాజంపేట, డిసెంబర్ 25 ప్రభాతవార్త**

మీరు ఇక్కడే పుట్టారు. వెంకటేశ్వర స్వామికి 32వేల కీర్తనలు రచించారు. అంకితం ఇచ్చారు. కానీ స్వామి మీ పేరుతో రాజంపేట జిల్లా చేయకుండా రాయచోటిని చేశారు. మాకు రాయచోటి వద్దు .రాజంపేట ముద్దు అంటూ వేలాదిమంది ప్రజలు శుక్రవారం వినూత్నంగా కడప రేణిగుంట జాతీయ రహదారిలోని బోయినపల్లిలో అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద వినతి పత్రం అందజేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాగా రాజంపేటను ప్రకటించాలని అన్నమయ్య థీమ్ పార్క్ వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టారు. జేఏసీనేతలతో పాటు కూటమినేతలంతా వినతిపత్రాలతో అన్నమయ్యకు మొరపెట్టుకున్నారు. జాతీయ రహదారిపై బైఠాయించారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ రాజంపేట నియోజకవర్గం నేత ఎల్లటూరి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ జగన్ సర్కార్ చేసిన పాపం రాజంపేటను వెంటాడుతోందని విమర్శించారు. వైకాపా హయంలో జరిగిన తప్పును కూటమి ప్రభుత్వం సరిదిద్ది రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్ని అర్హతలు ఉన్న రాజంపేట కాదని రాయచోటిని చేయడం అర్థం లేని పని అన్నారు. ప్రజల మనోభావాలను ప్రభుత్వం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. త్వరలోనే జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను కలిసి రాజపేట జిల్లా కేంద్రం చేయాలని కోరతామన్నారు. రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ అన్నమయ్య జన్మస్థలి పై జిల్లా కావాలని వేడుకోవడం బాధిస్తోందన్నారు. అన్నమయ్య పుట్టిన గడ్డ రాజంపేట అయితే రాయచోటిని అన్నమయ్య జిల్లాగా చేసి వైకాపా ప్రభుత్వం పాపం మూటగట్టుకుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల భావోద్వేగాలను, మనోభావాలను చూసి అయినా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జనసేన నేత పవన్ కళ్యాణ్‌ను కలిసి రాజపేట జిల్లా కేంద్రం చేయాలని కోరతామన్నారు. మరోవైపు జెఏసి ఆధ్వర్యంలో రాజంపేటలో జరుగుతున్న నిరాహార దీక్షలు 17 రోజులు చేరుకున్నాయి. టిడిపి అసెంబ్లీ జగన్ మోహన్ రాజు దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటకు జరిగిన అన్యాయాన్ని కుటుంబ ప్రభుత్వం సరిదిద్దుతుందని ధీమా వ్యక్తం చేశారు. వైకాపా హయాంలో జరిగిన పాపం రాజంపేటకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 17వ రోజు దీక్షలలో పోలి, అప్పారాజుపేట, సీతారాంపురం గ్రామపంచాయతీలకు చెందిన టిడిపి నేతలు కూర్చున్నారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు టి.లక్ష్మీనారాయణ, పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, డాక్టర్ సుధాకర్, పార్టీ గ్రామీణ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్,డాక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# జేఏసీ ఆధ్వర్యంలో సిద్ధవటంలో మౌన దీక్ష



**సిద్ధవటం డిసెంబర్ 26 ప్రభాతవార్త**

ఓట్ల కోసం విభజించి సిద్ధవటాన్ని రాజకీయంగా దోబూచులాట ఆడ వద్దని మండల జేఏసీ హెచ్చరించింది జిల్లా కేంద్రంగా పాలన చేసిన మండలాన్ని ఓట్ల కోసం రాజకీయ నేతలు విభజించు పాలించు అంటూ కడపలో పరిధిలో ఉన్న సిద్ధవటాన్ని అన్నమయ్య జిల్లా రాయచోటిలో విలీనం గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేసే అంతవరకు మా పోరాటం ఆగదని మండల జేఏసీ సభ్యులు పేర్కొన్నారు మండల కేంద్రమైన సిద్ధవటం లోని శుక్రవారం తహసిల్దార్ కార్యాలయం ఎదుట జై జేఏసీ మౌన దీక్ష చేపట్టారు ఈ సందర్భంగా జేఏసీ సభ్యుడు బండారు రాజగోపాలయ్య మాట్లాడుతూ 18 రోజులుగా సిద్ధవటం మండలం కడప జిల్లాలో విలీనం కొరకై పోరాటాలు కొనసాగిస్తూ చలో కలెక్టరేట్ పిలుపుతో సిద్ధవటం ఒంటిమిట్ట ప్రజలు స్వచ్ఛందంగా 3 వేల కు పైగా వచ్చి అభ్యంతరాలు తెలిపారని కడప జిల్లాలో ఒంటిమిట్ట సిద్ధవటం మండలాలు విలీనం చేయకపోతే స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో పాల్గొనే ప్రసక్తి లేదని పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ తమ పదవులకు రాజీనామా చేసి మండల సాధన కొరకై పోరాటాలు చేయాలని జేఏసీ పిలుపునిచ్చింది గూడూరు మండలాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేసినట్టు సిద్ధవటాన్ని కడప జిల్లాలో విలీనం చేపట్టాలని రాజకీయాల ఓట్ల కోసం దోబూచు లాట చేస్తే ప్రజా ఆగ్రహం తప్పదని జేఏసీ నేతలు మండిపడ్డారు శనివారం చేపట్టబోయే జల దీక్ష కార్యక్రమానికి జడ్పిటిసి, ఎంపీటీసీలు సర్పంచులు, కూటమినేతలు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి నిరసన కార్యక్రమం చేపట్టాలని మండల జేఏసీ నేతలు పాలెం నారాయణ, బండారు రాజగోపాలయ్య, బాలుగారి వెంకటసుబ్బయ్య, పోలు వెంకటసుబ్బయ్య, వినోద్, అయ్యవారు నాయుడు, జి సిద్దయ్య తెలిపారు.

# సర్వసభ్య సమావేశంలో రసాభాస



సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ సతీష్ రెడ్డి

**పీలేరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అందరికీనా.. లేక కొందరికేనా అంటూ ఎంపీపీ కంభం సతీష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సర్వసభ్య సమావేశంలో ఏపీవో అశోక్ రెడ్డిని నిలదీశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ తోపాటు ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పలువురు రైతులు ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం సాగు చేశారని, అయితే 45 మందికి మాత్రమే బిల్లులు పెట్టారని, 200 మందికి పైగా బిల్లులు పెట్టాల్సి ఉందని తెలిపారు. గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ రైతులకు బిల్లులు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ విషయం తమరికి తెలిపినా స్పందనలేదని ఏపీవో అశోక్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా ఇచ్చిన వేరుశెనగ విత్తనాలు అర్హులకు ఇవ్వకుండా పంచి పెటారని మండిపడ్డారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన యూరియా కూడా అందుబాటులో లేదన్నారు. మండలంలోని ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో వీధి లైట్లు కూడా వెలడం లేదని. ట్రాన్స్కో సిబ్బంది పట్టించుకోవడంల దేని అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరిత, మాజీ కోఆప్షన్ సభ్యులు షఫీ, ఎంపీడీవో , దండు జగన్మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితర సర్పంచులు ఎంపీటీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నలుగురు బీఎల్ఓలపై సస్పెన్షన్ వేటు

**- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి**

**కడప, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు బీఎల్ఓలను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక తనిఖీ మరియు నవీకరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సంబంధించి జిల్లాలో చేపడుతున్న సర్వేలో విధుల్లో తీవ్ర అలసత్వం వహించినందుకు కమలాపురం నియోజకవర్గ పరిధిలోని సి.కె.దిన్నె మండలం తాడిగొట్ల గ్రామ సచివాలయంలో పంచాయతీ సెక్రటరీగా చేస్తున్న శాంతమ్మ, వల్లూరు మండలం టీజీపల్లి గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ మారుతీ, వీఎన్‌పల్లె మండలంలోని అలిదెన గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ శివమహేశ్వర్‌రెడ్డి, పాలగిరి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మురళీకృష్ణలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టరు శుక్రవారం సాయంత్రం ఆర్డర్ కాపీలను జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితాల ప్రత్యేక తనిఖీ మరియు నవీకరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఎస్ఐఆర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ విధుల్లో విఫలం కావడం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయలేకపోవడం అలసత్వం వంటి కారణాలతో వారిని విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. ఎవరైనా ఎంతటి వారైనా సరే విధులు, బాధ్యతల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రకటన ద్వారా హెచ్చరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ప్రజా దర్బార్'



**బద్వేల్, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించాలనే ఉద్దేశంతో బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ . రితేష్ కుమార్ రెడ్డి బద్వేల్ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం 'ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. బద్వేల్ మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రితేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వం నుండి అందాల్సిన సేవలు ఆలస్యం లేకుండా చేరాలనే లక్ష్యంతో ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ తహసిల్దారు ఉదయ భాస్కర్ రాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) , పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అధికారుల సమక్షంలోనే పలు సమస్యలపై చర్చించి, పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని రితేష్ రెడ్డి సూచించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో బద్వేలు మండల టీడీపీ అధ్యక్షులు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి , కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అలాగే పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను వివరించారు.

# ప్రజలకు విద్యుత్ సమస్యలపై అవగాహన



వినియోగదారులకు అవగాహన ర్యాలీ

**కె.వి పల్లి, డిసెంబర్ 26 ప్రభాతవార్త:**

కె.వి పల్లి మండలం గ్యారంపల్లి గ్రామంలో గర్నిమిట్ట సెక్షన్ పరిధిలో"కరెంటోళ్ల జనబాట" కార్యక్రమాన్ని ఏఈ వరప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు గ్రామంలో పర్యటిస్తూ వినియోగదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యుత్ బిల్లుల సరైన చెల్లింపు విధానం, మీటర్ రీడింగ్‌లో జాగ్రత్తలు, లో వోల్టేజ్ సమస్యలు, తరచూ ఎదురయ్యే సరఫరా అంతరాయాలు తదితర అంశాలపై అధికారులు ప్రజలకు వివరించారు. చిన్న సమస్యలను వెంటనే సంబంధిత కార్యాలయాలకు తెలియజేస్తే వేగంగా పరిష్కారం చేస్తామని తెలిపారు. అలాగే భద్రతా చర్యలు పాటిస్తూ విద్యుత్ వినియోగం చేయాలని సూచించారు. గ్రామస్తుల నుంచి వచ్చిన వినతులను నమోదు చేసుకున్న అధికారులు, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన వాటిపై త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత సమీపంగా సేవలందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని ఏఈ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్యారంపల్లి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతృప్తి వ్యక్తం చేశారు.

# 28న హిందూ సమ్మేళనం

**దువ్వూరు, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఈనెల 28వ తేదీన హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రీయ స్వయం సేవక్ ఏర్పడి 100సంవత్సరాలు అయిన సందర్భంగా దీనిని ఏర్పాటు చేశామన్నారు. గుడిపాడు లోని కొత్త రామాలయంలో ఈ సభ జరుగుతుందని ఈ సదస్సుకు బ్రహ్మంగారి మఠంకు చెందిన శ్రీ అచలానంద స్వామి ఆశ్రమం మాతాజీ అలాగే ఇతరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ సమ్మేళనంలో హిందూ సోదరులు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా

# ఏకగ్రీవంగా ఎన్నికైన ఏవో నాగభూషణం



**రాయచోటి ,టౌన్ డిసెంబర్ 26 ప్రభాత వార్త**

అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికల గడువు ముగియడంతో, 2025-2028 కాలానికి సంబంధించి కొత్త ఏపీఆర్ఎస్ఏ కలెక్టరేట్ యూనిట్ ఎన్నికలు శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు ఏకగ్రీవంగా నిర్వహించబడినవి. ఈ ఎన్నికలలో శ్రీ నాగభూషణం, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రెసిడెంట్‌గా, శ్రీమతి శ్రావణి, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి. వంశీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ సెక్రటరీగా, అలాగే ఇతర పదవులకు సంబంధించిన అధికారులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలను సక్రమంగా నిర్వహించుటకు, కలెక్టర్ కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్న ఫణికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్‌ని ఎన్నికల అధికారిగా అన్నమయ్య జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి నరసింహ కుమార్ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

# 13లక్షలతో సిసి రోడ్లకు భూమి పూజ



**ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 26 ప్రభాత వార్త**

మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు 8 లక్షల రూపాయలు, గ్రామ పంచాయతీ నిధులు 5 లక్షల రూపాయలు వెరసి మొత్తం 13 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులకు తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. పంచాయతీ రాజ్ డిఈ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ పల్లె పండుగ 2.0లో భాగంగా డిప్యూటీ సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే నంద్యాల వరజరాజులరెడ్డి చొరవతో 16కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేశారని, గోపవరం పంచాయతీలోనే కోటి 30 లక్షల రూపాయలతో దాదాపు 18 రకాల పనులను ఎమ్మెల్యే కలెక్టర్ ద్వారా మంజూరు చేయించారని, వీటిలో 8 పనులు ఇప్పటికే పూర్తి కాగా, మరో 10 పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంక్షేమ డైరెక్టర్ శ్రీనివాసాచారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పట్నం లక్ష్మణ్ కుమార్, బచ్చల ప్రతాప్, ఆవుల రాజేశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్ ఆది, శంకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి,సు బ్బారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, సునీల్, పంచాయతీ రాజ్ ఏఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఖాలే, సంగమేశ్వర స్కూల్ ప్రసాద్, వెంకట సుబ్బయ్య, గౌస్, సుధాకర్, కుళ్ళు శ్రీను, తాటి శీను, గోపి, అంజి, సుబ్బారావు శెట్టి, సుబ్బారావు, మధు, పొన్నపురెడ్డి ప్రతాప్ రెడ్డి, హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్డీవో, డిఎస్పీ కార్యాలయాలకు స్థల పరిశీలన

**పీలేరు డిసెంబర్ 26 ప్రభాతవార్త:**

పీలేరులో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఆర్డిఓ, డిఎస్పీ కార్యాలయాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పీలేరును నూతన రెవెన్యూ డివిజన్ గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆర్డిఓ, డిఎస్పీ కార్యాలయాల ఏర్పాటుకు పరిశీలన చేయడం జరిగిందన్నారు. అతి త్వరలో ఈ కార్యాలయాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించేందుకు అధికారులకు తగిన సూచనలు చేశామన్నారు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పీలేరును రెవెన్యూ డివిజన్ గా ప్రకటించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, ఆర్డిఓ, డిఎస్పీ కార్యాలయాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ పనులను ప్రారంభించారని, అతి త్వరలో ఈ పనులు పూర్తవుతాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రాయచోటి ఆర్డిఓ శ్రీనివాస్, పీలేరు తహశీల్దారు శివకుమార్, రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

# పరిశోధన రచన నైపుణ్యాలను పెంచుకోవాలి




**కురబలకోట డిసెంబర్ .26 ప్రభాతవార్త**

విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే పరిశోధన, రచనా నైపుణ్యం, విజ్ఞానాన్ని పంచుకొనే అవకాశ ప్రక్రియలపై అవగాహన పెంచుకోవాలని ప్రొఫెసర్ డాక్టర్ బాల కుమార్ పిచాయ్ అన్నారు. శుక్రవారం కురబలకోట మండలం అంగళ్ళు సమీపాన ఉన్న మిట్స్ యూనివర్సిటీలో ఎంసీఏ విభాగం వారు జాతీయస్థాయి ఆర్టికల్ ప్రజెంటేషన్, పేపర్ పబ్లికేషన్స్ మరియు మేథో సంపత్తి హక్కుల ప్రాముఖ్యత అనే అంశముపై రెండు రోజులు పాటు వర్క్ షాప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్రం, తంజావూరులోని పే రియర్ మనియమి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ రీసెర్చ్ ట్రైనింగ్ అండ్ పబ్లికేషన్‌కు చెందినప్రొఫెసర్ డాక్టర్ బాల కుమార్ పిచ్చయ్య, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కుమారన్ షణ్ముగం, మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .పి. రామనాథన్ యూనివర్సిటీ అడ్వైజర్ ఆర్ అండ్ డిడాక్టర్ ఆర్. తులసి రామ్‌నాయుడులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాల కుమార్ పిచాయ్ మాట్లాడుతూ వెబ్ ఆఫ్ సైన్స్ జర్నల్స్ అనేవి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కఠినమైన సమీక్ష ప్రక్రియను అనుసరించే అత్యున్నత నాణ్యత గల పరిశోధన పత్రికలుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కుమారన్ షణ్ముగం మాట్లాడుతూ మేధాసంపత్తి హక్కులు ప్రాముఖ్యత పేటెంట్లు, కాపీ రైట్స్, ట్రేడ్ మార్క్స్, డిజైన్ హక్కులు వాటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించడంతోపాటు ఐపిఆర్ కు సంబంధించిన వివాదాలు చట్టపరమైన సమస్యలు పరిష్కార విధానాలను నిజజీవిత ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగధిపతి డాక్టర్ ఎన్ నవీన్ కుమార్, డాక్టర్ ఆర్ కల్పన, కోఆర్డినేటర్స్ డాక్టర్ కే రాధిక, డాక్టర్ కే నిర్మలా దేవి అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

**పులివెందుల డిసెంబర్ 26 ప్రభాత వార్త :**



పులివెందుల డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా డివిజన్ పరిధిలో మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని 33 కేసుల్లో ముద్దాయిలను పట్టివేతకు ట్రాఫిక్ సీఐ హాజీవల్లీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం రాజశ్రీ కడప జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు పులివెందుల సబ్ డివిజనల్ డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు మరియు ఎస్ఐలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2025 లో నమోదైన పలు రకాల కేసుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ 2025 సంవత్సరములో సబ్ డివిజన్ పరిధిలో 90 దొంగతనాలు నమోదు కాగా వాటిలో మొత్తం ప్రాపర్టీ 59,13,380 / రూపాయలు దొంగతనం కాగా వాటిలో 57 కేసులలో ముద్దాయిలను కనుగొని వారి ద్వారా 36,64,350/ రూపాయలు రికవరీ చేయడం జరిగినది. ఇందులో 60 శాతం చోరీ జరిగిన సొమ్మును రికవరీ చేయడం జరిగిందని అదేవిధంగా ఇంకా పెండింగ్ లో ఉన్న 33 కేసులలో ముద్దాయిలను కనుగొనటానికి పులివెందుల ట్రాఫిక్ సిఐ హాజీవల్లి ఆధ్వర్యంలో సిబ్బంది వేణుగోపాల రెడ్డి ,రామ్ రమేష్, శివ, సుబ్రమణ్యం ల తోటి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆదేవిధముగా దొంగతనం కేసులకు సంబంధించి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగముగా సబ్ డివిజన్ పరిధిలో మూడు చెక్ పోస్టులు 1)కనంపల్లె 2)అద్దాలమర్రి 3)పార్నపల్లె ల వద్ద ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇతర జిల్లాల నుంచి పులివెందులకు రాకపోకలు సాగించే వారిపై 24 గంటలు నిఘా ఉంచి వాహనాలను చెక్ చేయటం జరుగుతుందన్నారు. అదేవిధముగా పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయో వాటిని గుర్తించి,ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించుకొని రోడ్డు ప్రమాదాలను తగ్గించటానికి నివారణ చర్యలు తీసుకోవటం జరుగుతుంది.

# నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్

**బద్వేలు అర్బన్, డిసెంబర్ 26, ప్రభాతవార్త**



నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు బద్వేల్ అర్బన్ సీఐ ఎస్. లింగప్ప తెలిపారు. డ్రంక్ డ్రైవింగ్‌కు పాల్పడితే మోటారు వాహనాల చట్టం-1988 సెక్షన్ 185 కింద కేసులు నమోదు చేసి, జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ లేదా రద్దుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. లైసెన్స్, నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేయబడతాయని తెలిపారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, అధిక శబ్దాలు చేసే సైలెన్సర్ల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**సుండుపల్లి,డిసెంబర్ 26,ప్రభాతవార్త :**



మండల తాసిల్దార్ కార్యాలయంలో డిజిటల్ కీ దుర్వినియోగం చేసి అక్రమంగా పొసెషన్ సర్టిఫికెట్లను జారీ చేసిన టైపిస్ట్ ప్రశాంత్ నాయక్ ను సుండుపల్లి ఎస్సై హుస్సేన్ పోలీస్ సిబ్బంది శుక్రవారం సాయంత్రం 04 గంటలకు రాయచోటిలో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ రోషన్ మాట్లాడుతూ డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన టైపిస్ట్ ప్రశాంత్ నాయక్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టామని పేర్కొన్నారు. సదరు టైపిస్టు తమకు అందుబాటులో లేకుండా పారిపోయిన నేపథ్యంలో పలుచోట్ల వెతికామని నేడు రాయచోటిలో అతన్ని అరెస్టు చేశామని పేర్కొన్నారు. సదరు టైపిస్టును శనివారం న్యాస్థానంలో హాజరు పరుస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుండుపల్లి తాసిల్దార్ కార్యాలయంలో డిజిటల్ కీ దుర్వినియోగానికి పాల్పడిన టైపిస్టు ప్రశాంత్ నాయక్ ను నేడు పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిందని, అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు.

# హుండీల లెక్కింపు..

**పెండ్లిమర్రి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**



శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం పొలతల నందు అనుబంధ దేవస్థానాలైన శ్రీఅక్కదేవతలు, బండెన్నస్వామి, మరియు పుట్టాంజనేయస్వామి దేవస్థానముల శాశ్వత హుండీలను శుక్రవారం రమణమ్మ సూపరింటెండెంట్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్, ఆలయ ఛైర్మన్ శిరిగిరెడ్డి రాజారెడ్డి, పాలకమండలి సభ్యుల సమక్షంలో శాశ్వత హుండీలను తెరిచి లెక్కించడం జరిగింది. శ్రీమల్లేశ్వర స్వామి దేవస్థానం శాశ్వత హుండీ ఆదాయం రూ.792450, అక్కదేవతల హుండీ ఆదాయం రూ.10,25,202, బండెన్నస్వామి శాశ్వత హుండీ ఆదాయం రూ.51,717, పుట్టాంజనేయస్వామి శాశ్వత హుండీ ఆదాయం రూ.51,933, అన్నదాన హుండీ ఆదాయం రూ.27వేలు, కలికి రూ.19,24,002, సుమారుగా మిక్స్‌డ్ వెండి 2.400 కేజీలు, మిక్స్‌డ్ బంగారు 22 గ్రాములు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ తెలిపారు.

# పూర్వ విద్యార్థులచే పది మెటీరియల్ పంపిణీ



**పెండ్లిమర్రి, డిసెంబరు 26, ప్రభాతవార్త:**

ఎగువపల్లి జడ్పీ హైస్కూలులో 1987-88 పది చదివిన పూర్వ విద్యార్థుల బృందం కందుల వెంకట సుబ్బారెడ్డి, కల్లూరు ప్రతాప్‌రెడ్డి, వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో ప్రస్తుత పాఠశాలలో 10వ తరచగతి చదువుతున్న పిల్లలకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పదివేల రూపాయలు విలువ చేసే ఆంగ్ల, సోషల్, గణితం, ఫిజికల్ సాన్స్ స్టడీ మెటీరియల్‌ను 48 మందికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలకు ఇతోదికంగా సహాయం చేసి రుణం తీర్చుకోవాలని అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద పిల్లలకు సహాయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేస్తున్నట్లు వారు తెలిపారు. పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గునిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ పిల్లలు ఈ మెటీరియల్‌ను చక్కగా ఉపయోగించుకొని వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణారెడ్డి, బాలరాజారెడ్డి, వెంకట సుబ్బయ్య, వెంకట సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, పుష్పలత, తిరుమల కొండయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీర బాల దివస్.

**చిట్వేలి, డిసెంబర్ 26, ప్రభాతవార్త:**



స్థానిక మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వీర బాల దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు కామటం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముస్లిం పాలకులైన మొఘలుల అరాచక పరిపాలనను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన 5 సంవత్సరాల ఫతేసింగ్, 7 సంవత్సరాల జొరావర్ సింగ్ వీరమరణానికి గుర్తుగా ఈరోజు జరుపుకుంటామన్నారు. వారి త్యాగం నేటి తరాలు స్మరించుకునేందుకే ప్రభుత్వం ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. అవసరమైనప్పుడు పిల్లలు అధైర్య పడకుండా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో సహ ఉపాధ్యాయులు సిబ్బంది పిల్లలు పాల్గొన్నారు.